


Truth of News
PRGI Reg No: APTEL/26/A4784

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

నంద్యాల | సంపుటి: 03 | సంచిక : 18 | గురువారం 27 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## నేపాల్ ప్రధాని బాలెన్ షాతో మాట్లాడిన ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ- సూర్య వాస్తవం**

నేపాల్‌లోని భోటే కోషి నదిలో ఆకస్మికంగా సంభవించిన వరద ప్రవాహంపై నేపాల్ ప్రధానమంత్రి బాలెన్ షాతో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారు. పొరుగు దేశంలో సంభవించిన వినాశకరమైన వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుబాలకు ఆయన తన సంతాపాన్ని తెలియజేశారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో నేపాల్‌కు సాధ్యమైనంత మానవతా, సహాయక చర్యల రూపంలో భారత్ పూర్తి మద్దతును అందిస్తుందని ప్రధాని మోదీ షాకు హామీ ఇచ్చారు. ఈ క్లిష్ట సమయంలో నేపాల్‌లోని నా సోదర సోదరీమణులకు భారతీయులందరూ అండగా నిలుస్తారని, నేపాల్‌కు సాధ్యమైనంత మేర మానవతా దృక్పథంతో కూడిన సహాయాన్ని అందించడానికి భారత్ సిద్ధంగా ఉందన్నారు.



సహాయక, పునరావాస చర్యల విషయంలో మా బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, 'ఎక్స్' వేదికగా ప్రధాని మోదీ పోస్ట్ చేశారు.

- మిగతా 2లో..

## రాహుల్ x కంగనా

- వాణిజ్య ప్రకటనలో నటి కృతి వస్త్రధారణపై దుమారం
- రాఖీ పండుగ యాడ్‌లో అలాంటి వస్త్రధారణేంటి? : బీజేపీ ఎంపీ కంగనా
- కృతి దుస్తుల ఎంపిక శోచనీయమంటూ వ్యాఖ్యలు
- కంగనా పోస్టుపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ అభ్యంతరం
- దుస్తుల ఎంపిక మహిళల వ్యక్తిగత చాయిస్ అంటూ కౌంటర్
- రాహుల్ వ్యాఖ్యలపై కంగనా రీ కౌంటర్
- మహిళా సాధికారత విషయంలో కాంగ్రెస్ వైఖరిని పునఃసమీక్షించుకోవాలని హితవు



**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

బాలీవుడ్ నటి కృతి సనన్ తాజాగా నటించిన ఓ ఆభరణాల వాణిజ్య ప్రకటన ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవవారం విడుదలైన ఈ ప్రకటనపై మిశ్రమ స్పందనలు

- మిగతా 2లో..




## ఏడుగురు మత్స్యకారులు సేఫ్..

### - సీఎం చంద్రబాబు హర్షం

**అమరావతి - సూర్య వాస్తవం**

సముద్రంలో గల్లంతైన ఏడుగురు ఏపీ మత్స్యకారులు పశ్చిమ బెంగాల్ తీరంలో సురక్షితంగా బయటపడ్డారు. దీంతో సీఎం చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఆగస్టు 3న కోనసీమ జిల్లా ఓడలరేవు ఫిషింగ్ ల్యాండింగ్ సెంటర్ నుంచి

- మిగతా 2లో..



## కెఎన్ఎస్ యూతో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఎంఓయూ

### - మంత్రి వాకిటి శ్రీహరికి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు

**హైదరాబాద్- సూర్య వాస్తవం**

యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, ప్రపంచంలోనే

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# ఇదేనా వికసిత్ భారత్?

- సంపద కొద్దిమంది గుప్పెట్లో!..
300 కుటుంబాల చేతిలో రూ.138 లక్షల కోట్లు
- నెదర్లాండ్స్, సౌదీ, స్విట్జర్లాండ్, పోలాండ్ ఆర్థిక వ్యవస్థల కంటే అధికం
- మోడీ పాలనలో బడా వ్యాపారవేత్తలకు అచ్చేదిన్
- ఒకవైపు కోట్లాది కుటుంబాల జీవన పోరాటం..
- మరోవైపు కార్పొరేట్ కుటుంబాల సంపదకు రెక్కలు
- బీజేపీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ దుస్థితి

'వికసిత్ భారత్' అంటూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేస్తున్న వేళ.. దేశంలో సంపద పంపిణీపై మరోసారి తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయి. హురున్ 2026 జాబితా ప్రకారం దేశంలోని 300 అత్యంత విలువైన కుటుంబ వ్యాపారాల మొత్తం విలువ ఏకంగా రూ.138 లక్షల కోట్లకు చేరింది. ఈ మొత్తం కూడా నెదర్లాండ్స్, సౌదీ అరేబియా, స్విట్జర్లాండ్, పోలాండ్ వంటి దేశాల ఆర్థిక వ్యవస్థల కంటే ఎక్కువ. మరి ఈ అపారమైన సంపద పెరుగుదల ఫలాలు సామాన్యుడి జీవితంలో ఎంత మేరకు కనిపిస్తున్నాయన్నదే అసలు ప్రశ్న.

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతోం దని, భారత్ ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక శక్తిగా ఎదుగుతోందని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పదేపదే చెప్తోంది. కానీ అదే సమయంలో సంపద కొద్దిమంది చేతుల్లోనే మరింత కేంద్రీకృతమ



వుతున్న దృశ్యం కనిపిస్తోం ది. 2026 'బార్క్లేస్ ప్రయివేట్ క్లయింట్స్ హురున్ ఇండియా మోస్ట్ వాల్యూయబుల్ ఫ్యామిలీ బిజినెస్' జాబితా ప్రకారం.. దేశంలోని 300 కుటుంబ వ్యాపారాల సంయుక్త విలువ రూ.138 లక్షల కోట్లకు చేరింది. గత రెండేండ్లలోనే వీటి విలువ సుమారు రూ.30 లక్షల కోట్లు పెరిగింది. సంపన్న కుటుంబాల ఆస్తులు, కంపెనీల విలువలు, షేర్ల విలువలు

- మిగతా 2లో..



## 2 చరణాల వందేమాతరాన్నే ఆలపిస్తాం

### - కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటాం
### - కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ప్రకటన

**బెంగళూరు- సూర్య వాస్తవం**

వందేమాతరం పూర్తి గీతం ఆలపించబోమని, ఈ విషయంలో పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివ కుమార్ ప్రకటించారు. గీతంలోని రెండు చరణాలను మాత్రమే పాడతామని చెప్పారు. బుధవారం మీడియా వందేమాతరం పూర్తి గీతం ఆలపణపై ప్రశ్నించగా ఆయన ఈ విధంగా సమాధానం ఇచ్చారు. ఇకపై తమ రాష్ట్రంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో కూడా గతంలో నిర్ణయించిన విధంగాన

- మిగతా 2లో..

## నేపాల్‌లో వరద బీభత్సం

- 100 మందికి పైగా మృతి.. 750 మంది గల్లంతు
- వీరిలో 105 మంది భారతీయులు
- ఉత్తర నేపాల్‌లో ఉగ్రరూపం దాల్చిన భోటేకోశీ నది
- వంతెనలు, రహదారులు, ప్రాజెక్టులు ధ్వంసం
- సహాయక చర్యలు

**ఖాట్మండ్ - సూర్య వాస్తవం**

నేపాల్‌లో ఆకస్మిక వరదలు పెను విధ్వంసాన్ని సృష్టించాయి. టిబెట్ సరిహద్దుల్లో ఉద్భవించిన ఈ మెరుపు వరదల్లో చిక్కుకుని ఇప్పటివరకు 95



మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 500 మంది గల్లంతయ్యారు. గల్లంతైన వారిలో 105 మంది భారతీయులు ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. రసువా, ధాడింగ్, నువాకోట్ జిల్లాల్లో వరద తీవ్రతకు వంతెనలు, రహదారులు, డజనుకు పైగా జలవిద్యుత్ ప్రాజెక్టులు ధ్వంసమయ్యాయి. బాధితుల సహాయార్థం భారత రాయబార కార్యాలయం అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లను అందుబాటులోకి తెచ్చింది. నేపాల్ సైన్యం హెలికాప్టర్లతో సహాయక

- మిగతా 2లో..

## భయంకర కరవు పరిస్థితులు ఉన్నా చంద్రబాబు ప్రభుత్వం స్పందించడం లేదు

- డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని సవాల్ విసిరినా సమాధానం లేదన్న జగన్
- 28 జిల్లాల్లో తీవ్ర లోటు వర్షపాతం నమోదయిందని ఆందోళన
- చంద్రబాబు మాటలు నమ్మి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన

**అమరావతి - సూర్య వాస్తవం**

కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని తమ పార్టీ విసిరిన సవాలుకు చంద్రబాబు ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి సమాధానం లేదని ఆయన ఆరోపించారు. తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కరవు భయంకరమైన పరిస్థితులకు



- మిగతా

## 2 చరణాల వందేమాతరాన్నే ఆలపిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

తొలి రెండు చరణాలు మాత్రమే పాడతామని స్పష్టం చేశారు. 1937లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీసుకున్న నిర్ణయాన్ని డీకే సమర్థించారు. భారత్ భిన్న భాషలు, సంస్కృతులు, ప్రాంతాలతో కూడిన దేశమని అన్నారు. ప్రతి వర్గాన్ని గౌరవించడమే కాంగ్రెస్ సిద్ధాంతమని చెప్పారు. బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. వందేమాతరం తరువాతి చరణాల్లో దుర్గ, లక్ష్మి, సరస్వతి వంటి హిందూ దేవతల ప్రస్తావన ఉందని కాంగ్రెస్ చెబుతోంది. ఇతర వర్గాలకు అవి అభ్యంతరకరంగా ఉండొచ్చన్న కారణంతో తొలి రెండు చరణాలకే పరిమితం కావాలని నిర్ణయించింది. కర్ణాటకలోనూ ఇదే నిర్ణయం అమలవుతుందని శివకుమార్ స్పష్టం చేశారు.

## భయంకర కరవు పరిస్థితులు ఉన్నా చంద్రబాబు ప్రభుత్వం స్పందించడం లేదు

(మొదటిపేజీ తరువాయి)

దారితీసిందని, మొత్తం 28 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందని జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. రాయలసీమతో పాటు కోస్తా ప్రాంతంలోనూ తీవ్రమైన అభద్రతా వాతావరణం నెలకొన్నా చంద్రబాబు ప్రభుత్వం స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో కేవలం 52 శాతం వర్షపాతం మాత్రమే నమోదైందని, మొత్తం 688 మండలాలకు గానూ 625 మండలాల్లో తీవ్ర లోటు వర్షపాతం ఉందని వివరించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల జూన్, జులై నెలల్లో తక్కువ వర్షాలు పడతాయని తెలిసినప్పటికీ... పంటలకు నీళ్లిస్తామని ప్రభుత్వం ఆర్భాటం చేసిందని, వారి మాటలను నమ్మి ఎకరాకు రూ.15 వేలకు పైగా పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఒకవైపు వర్షాలు లేక రైతాంగం సంక్షోభంలో కూరుకుపోతుంటే, నీటి విడుదల విషయంలో చంద్రబాబు ఏమాత్రం మానవత్వం లేకుండా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యంగా రాయలసీమ ప్రాజెక్టుల పట్ల కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. శ్రీశైలం జలాశయంలో ఉన్న నీటిని కరవుతో అల్లాడుతున్న రైతులకు అందించాల్సింది పోయి... తెలంగాణతో పోటీపడి విద్యుత్ ఉత్పత్తి కోసమే వినియోగించడం దారుణమన్నారు. అవకాశమున్నా పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమకు నీటిని విడుదల చేయడానికి చంద్రబాబుకు మనసు ఒప్పలేదని విమర్శించారు. సెప్టెంబర్ 15 తర్వాత వర్షాలు తగ్గుముఖం పడతాయని వాతావరణ శాఖ చెబుతున్న నేపథ్యంలో, రానున్న రోజుల్లో రాయలసీమకు నీరు ఎలా ఇస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని నిలదీశాం

## ఏడుగురు మత్స్యకారులు సేఫ్..

(మొదటిపేజీ తరువాయి)

చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల పడవ సాంకేతిక లోపానికి గురై, బలమైన గాలుల కారణంగా సముద్రంలో గల్లంతైంది. దీంతో మత్స్యకారుల ఆచూకీ కోసం అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. నేవీ, కోస్ట్‌గార్డ్, కేంద్ర మెరైన్ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి. చివరకు పశ్చిమ బెంగాల్‌లోని శంకర్‌పూర్ సమీపంలో పడవతో పాటు ఏడుగురు మత్స్యకారులను అధికారులు గుర్తించారు. వారి ఆచూకీ లభించిన వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా బయటపడటంపై సీఎం చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. మత్స్యకారుల ఆచూకీ కోసం సీఎం ఇప్పటికే మూడు సార్లు సమీక్ష నిర్వహించి, గాలింపు చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. మత్స్యకారులను సురక్షితంగా స్వస్థలాలకు తీసుకురావడానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గాలింపు చర్యల్లో సమన్వయంతో పనిచేసిన అధికార యంత్రాంగం, నేవీ, కోస్ట్‌గార్డ్, కేంద్ర మెరైన్ విభాగాలకు సీఎం అభినందనలు తెలిపారు. మత్స్యకారులను త్వరగా స్వస్థలాలకు తీసుకొచ్చేలా చర్యలు కొనసాగుతున్నాయి.

## కెఎన్ఎస్ యూతో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఎంఓయూ

(మొదటిపేజీ తరువాయి)

అత్యున్నత పని తీరు కలిగిన క్రీడలకు ప్రముఖ సంస్థల్లో ఒకటైన కొరియా నేషనల్ స్పోర్ట్ యూనివర్సిటీ (కెఎన్ఎస్ యూ) తో ఎంఓయూ కుదుర్చుకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. గతంలో తన దక్షిణ కొరియా పర్యటనలో కొరియా నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ అధ్యక్షులు మూన్ వోన్-జే తో సహా ఉన్నత ప్రతినిధి బృందాన్ని కలిశానని గుర్తు చేశారు. ప్రతిపాదిత యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, కెఎన్ ఎస్ యూమధ్య భాగస్వామ్యం కోసం తాము వివరంగా చర్చించినట్టు తెలిపారు. ఈ భాగస్వామ్యం ఇప్పుడు కేవలం ఒక ఎంఓయూ కంటే ఎక్కువ. ఇది తెలంగాణ క్రీడా ప్రతిభకు, అథ్లెట్ శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్, హై-పెర్ఫార్మెన్స్ ఎడ్యుకేషన్ లో ప్రపంచ ఉత్తమ విధానాలకు మధ్య ఒక వారధి అని ఆయన పేర్కొన్నారు.

కెఎన్ఎస్ యూలో శిక్షణ పొందిన అథ్లెట్లు పారిస్ ఒలింపిక్స్ లో దక్షిణ కొరియా సాధించిన 32 పతకాలలో 16 పతకాలను అందించారు. అలాంటి శ్రేష్టమైన సంస్కృతిని తెలంగాణకు తీసుకురావాలని తాము కోరుకున్నట్టు ఆయన తెలిపారు. అలాంటి కార్యక్రమాన్ని ముందుకు నడిపించి, మన యువ అథ్లెట్లు ప్రపంచ క్రీడా శ్రేష్టత నుంచి నేర్చుకునేందుకు కొత్త మార్గాలను తెరిచిన రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి, క్రీడా మంత్రిత్వ శాఖ అధికారులకు, స్పోర్ట్స్ యూనివర్సిటీకి అభినందనలు తెలిపారు. దీంతో మన గ్రామాలు, పట్టణాల నుండి ఒలింపిక్ పోడియం వరకు తెలంగాణ ఈ ప్రయాణానికి సిద్ధమవుతోందని చెప్పారు. భారత్ 2036 ఒలింపిక్స్ వైపు చూస్తున్న తరుణంలో, తెలంగాణ సిద్ధంగా ఉండాలని నిశ్చయించుకుందని స్పష్టం చేశారు. కేవలం ప్రపంచంలోని గొప్ప క్రీడా ఈవెంట్ కు ఆతిథ్యం ఇవ్వడానికి మాత్రమే కాదు, భారతదేశాన్ని గర్వపడేలా చేసే అథ్లెట్లను తయారు చేయడానికి కూడా నిశ్చయించుకున్నట్టు తెలిపారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తోన్న ఫ్యూచర్ సిటీ (ఫోర్త్ సిటీ) లో నిర్మించే స్పోర్ట్స్ హబ్ లో ఏర్పాటు చేస్తారని సీఎం తెలిపారు.

## ఇదేనా వికసిత్ భారత్?

(మొదటిపేజీ తరువాయి)

పెరగడం ద్వారా వారి మొత్తం సంపదలో రోజుకు సగటున రూ.4,076 కోట్ల మేర పెరుగుదల నమోదైంది.

**సామాన్యుడి వాటా ఎంత?**

హురున్ లెక్కల ప్రకారం... ఈ 300 కుటుంబ వ్యాపారాల మొత్తం విలువ 1.46 ట్రిలియన్ డాలర్లకు సమానం. వీటన్నింటినీ ఒక దేశంగా పరిగణిస్తే ప్రపంచంలో 18వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని హురున్ ఇండియా వ్యవస్థాపకులు, ప్రధాన పరిశోధకులు అనస్ రెహ్మా న్ జునైద్ వివరించారు. ఇది భారత ఆర్థిక వ్యవ స్థలో సంపద సృష్టి ఎంత భారీ స్థాయిలో జరుగు తోందో చూపుతున్నప్పటికీ.. ఆ సంపద ఎవరి చేతుల్లో కేంద్రీకృతమవుతోందన్న ప్రశ్నను కూడా ముందుకు తెస్తోంది. దేశంలో ఉద్యోగాలు, వేతనా లు, జీవన వ్యయం, చిన్న వ్యాపారాల పరిస్థితి వంటి అంశాలపై సామాన్య ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్న సమయంలో కార్పొరేట్ కుటుం బాల ఆస్తుల విలువ మాత్రం కొత్త రికార్డులు సఅష్టిస్తుండటం గమనార్హం.

**అగ్రస్థానంలో అంబానీలు, అదానీలు**

జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో అంబానీ కుటుంబం రూ.25.83 లక్షల కోట్ల విలువతో అగ్ర స్థానంలో ఉంది. బిర్లా కుటుంబం రూ.8.14 లక్షల కోట్లతో రెండో స్థానంలో ఉండగా, జిందాల్ కుటుం బం రూ.8.02 లక్షల కోట్లతో మూడో స్థానంలో ఉంది. బజాజ్ కుటుంబం రూ.7.70 లక్షల కోట్లు, మహీంద్రా కుటుంబం రూ.5.15 లక్షల కోట్ల విలు వతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇక మొదటి తరం వ్యాపార కుటుంబాల్లో గౌతమ్ అదానీ కుటుంబం రూ.19.6 లక్షల కోట్ల విలువతో అగ్ర స్థానంలో ఉంది. సునీల్ భారతి మిట్టల్ కుటుంబం రూ.12.1 లక్షల కోట్లతో తర్వాతి స్థానంలో ఉంది.

**జిందాల్ సంపదకు రెక్కలు**

సంపదను అత్యధికంగా పెంచుకున్న కుటుంబంగా జిందాల్ కుటుంబం నిలిచింది. కుటుంబ వ్యాపార విలువ రూ.3.3 లక్షల కోట్లు పెరిగి రూ.8.02 లక్షల కోట్లకు చేరింది. అంటే 70 శాతం పెరుగుదల నమో దైంది. అనిల్ అగర్వాల్ కుటుంబం రూ.3.03 లక్షల కోట్ల విలువను అదనంగా సృష్టించగా, కుమార్ మంగ ళం బిర్లా కుటుంబం రూ.2.75 లక్షల కోట్లు జోడించింది.

**'వికసిత్ భారత్'లో అసలు అభివృద్ధి ఎవరిది?**

మోడీ ప్రభుత్వం 'వికసిత్ భారత్'ను ప్రధాన లక్ష్యంగా ప్రచారం చేస్తున్న నేపథ్యంలో.. దేశ ఆర్థిక వృద్ధిని కేవలం బిలియనీర్ల సంపదతోనే కొలవలేం. సాధారణ కుటుంబాల ఆదాయం ఎంత పెరిగింది? యువతకు స్థిరమైన ఉద్యోగాలు ఎన్ని వచ్చాయి? చిన్న, మధ్యతరహా వ్యాపారాలు ఎంత బలపడ్డాయి? ధరల పెరుగుదలతో ప్రజల కొనుగోలు శక్తి ఎంత దెబ్బతింది? గ్రామీణ కుటు ంబాల ఆదాయ పరిస్థితి ఏమిటి? వంటి ప్రశ్నలకు కూడా సమాధానాలు అవసరమని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు.

**అసమానతకు సంకేతాలా?**

హురున్ జాబితాలోని టాప్ 10 కుటుంబాలే మొత్తం జాబితా విలువలో 51 శాతం వాటా కలిగి ఉన్నాయి. అదే సమయంలో కనీసం ఒక బిలియన్ డాలర్ల విలువ కలిగిన కుటుంబాల సంఖ్య 230కు చేరింది. అంటే భారత్‌లో పెద్ద వ్యాపారాల విలువ వేగంగా పెరుగుతున్నప్పటికీ.. సంపద కేంద్రీకరణ కూడా గమనించాల్సిన అంశంగా మారుతోంది. 'భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అవుతుంది' అనే మోడీ ప్రభుత్వ లక్ష్యాల మధ్య.. ఆ వృద్ధి ఫలాలు సామాన్యుడి జేబుకు, యువత ఉద్యోగాలకు, రైతు ఆదాయానికి, మధ్యతరగతి జీవన ప్రమాణాలకు ఎంతగా చేరుతున్నాయో ప్రభుత్వం స్పష్టంగా చెప్పాల్సిన అవసరం ఉందని సామాజికవేత్తలు, మేధావులు ప్రశ్నిస్తున్నారు.

**352 శాతం పెరిగిన అహూజా కుటుంబ సంపద**

శాతాల పరంగా చూస్తే శాహీ ఎక్స్‌పోర్ట్స్‌కు చెందిన అహూజా కుటుంబం అత్యధిక వృద్ధిని నమోదు చేసింది. వారి వ్యాపార విలువ 352 శాతం పెరిగి రూ.37,500 కోట్లకు చేరింది. గార్వేర్ హైటెక్ ఫిల్మ్స్‌కు చెందిన శశికాంత్ భాలచంద్ర గార్వేర్ కుటుంబం సంపద 300 శాతం పెరిగి రూ.15,600 కోట్లకు చేరింది.

## రాహుల్ x కంగనా

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తమయ్యాయి. ఆ ప్రకటనలో కృతి సనన్ వస్త్రధారణపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. సంప్రదాయ పండుగకు సంబంధించిన ప్రకటనలో ఆమె వస్త్రధారణ అభ్యంతరకరంగా ఉందంటూ సోషల్‌మీడియా ద్వారా నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ అంశ రాజకీయపరంగానూ దుమారం రేపింది. కృతి వస్త్రధారణపై బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్‌కు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ మధ్య వాగ్యుద్ధం జరుగుతున్నది. కంగనా 'బ్రో కాస్త ఆగు' అంటూ రాహుల్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మొత్తానికి ఇప్పుడీ అంశం కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధంగా మారింది. ఇంతకీ ఎంపీ కంగనా రనౌత్ ఏమని స్పందించారంటే.. 'సంప్రదాయ పండుగ రాఖీకి సంబంధించిన ప్రకటనలో అభ్యంతర దుస్తులతో నటిం చడం బాధాకరమని తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

'నటి కృతి సనన్ నటించిన ఆభరణాల వాణిజ్య ప్రకటనలో ఆమె వస్త్రధారణ అభ్యంతరకరం. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన రాఖీ పండుగ సందర్భంగా ప్రకటన చిత్రీకరణ జరిగింది. అయితే.. ప్రకటనలో ఆమె ధరించిన దుస్తులు విచిత్రంగా, అభ్యంతరకరంగా ఉన్నాయి. రాఖీ పండుగకు సంప్రదాయాలకు అద్దం పట్టే ఎన్నో రకాల దుస్తులు ఎంపిక చేసుకోవచ్చు. కానీ.. కృతి మాత్రం అందుకు భిన్నంగా అభ్యంతర దుస్తులు ఎంచుకోవడం బాధాకరం' అంటూ రాసుకొచ్చారు.

**ఎంపీ కంగనాకు నటి కృతి కౌంటర్**

ఎంపీ కంగనా రనౌత్ పోస్టుపై నటి కృతి సనన్ కౌంటర్ ఇచ్చారు. వస్త్రధారణ, సంప్రదాయాలు వేర్వేరు అంశాలని, దయచేసి వస్త్రధారణ అంశాన్ని సంప్రదాయాలకు ముడిపెట్టవద్దని సూచించారు. మహిళల వస్త్రధారణను బట్టి వారి గౌరవాన్ని అంచనా వేయవద్దని హితవు పలికారు.ఎవరికి నచ్చిన దుస్తులు వారు ధరించే స్వేచ్ఛ ఉంటుందని రాసుకొచ్చారు. రక్షాబంధన్ పండుగ అర్థం భావోద్వేగాలతో కూడుకున్నదే, కానీ దుస్తులతో సంబంధం లేదని తేల్చిచెప్పారు. మరోవైపు, కృతి సనన్‌కు మద్దతుగా ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ నిలిచారు. మహిళల వస్త్రధారణ అనేది వారి వ్యక్తిగత ఎంపిక అంటూ వ్యాఖ్యానించారు.

**దుస్తులు మహిళల వ్యక్తిగత ఎంపిక: రాహుల్**

వాణిజ్య ప్రకటనలో నటి కృతి సనన్ వస్త్రధారణపై సోషల్ మీడియాలో ట్రోలింగ్‌పై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం స్పందించారు. సోషల్ మీడియా వేదికగా కృతి సనన్‌కు మద్దతు ప్రకటించారు. 'మహిళలు ఏ తరహా దుస్తులు ధరించాలి.. ఎక్కడికి వెళ్లాలనేది వారి సొంత ఎంపిక. కేవలం వస్త్రధారణ ఆధారంగా మహిళలను ట్రోల్ చేయడం సరికాదు. అలా ట్రోల్ చేయడం పితృస్వామ్య భావజాలంలో భాగమే. పితృస్వామ్యాన్ని కూల్చివేయాల్సిందే. మహిళలెవరికీ బానిసలు కాదు. మహిళల వ్యక్తిగత స్వేచ్ఛను ప్రతిఒక్కరూ గౌరవించి తీరాలి' అని సూచించారు.

**రాహుల్‌కు కంగనా రీకౌంటర్**

రాహుల్ వ్యాఖ్యలపై బుధవారం ఎంపీ కంగనా స్పందిస్తూ.. 'బ్రో.. కాస్త ఆగు' అంటూ ఆమె వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పితృస్వామ్యాన్ని కూల్చేస్తామని రాహుల్ గళమెత్తే ముందు మహిళా సాధికారత విషయంలో ఒకసారి కాంగ్రెస్ వైఖరిని పునః సమీక్షించుకోవాలని హితవు పలికారు. చట్టసభల్లో మహిళల రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ వ్యతిరేకించిందని గుర్తుచేశారు. ట్రిపుల్ తలాక్ విషయంలో కాంగ్రెస్ వైఖరిని గుర్తుచేసుకోవాలని హితవు పలికారు. కర్ణాటక మంత్రివర్గంలో మహిళల ప్రాతినిధ్యం లేకపోవడాన్ని ఎత్తిచూపారు.

## నేపాల్‌లో వరద బీభత్సం

(మొదటిపేజీ తరువాయి)

చర్యలను ముమ్మరం చేసింది.?బుధవారం ఉదయం 9 గంటల సమయంలో నేపాల్-టిబెట్ సరిహద్దుల్లోని భోటేకోశీ నదికి ఒక్కసారిగా భారీ వరద పోటెత్తింది. టిబెట్-రసువాగఢి సరిహద్దుకు 20 కిలోమీటర్ల దూరంలో కొండచరియలు విరిగిపడటంతోనే ఈ విపత్తు సంభవించినట్టు ప్రాథమిక నివేదికలు, శాటిలైట్ చిత్రాల ద్వారా అధికారులు గుర్తించారు. లెంధే నది ఉప్పొంగి ఆ వరద నీరు భోటేకోశీ మీదుగా త్రిశూలి నదిలోకి ప్రవేశించడంతో రసువా, ధాడింగ్, నువాకోట్, చిత్వాన్ జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. వివిధ జిల్లాల్లో కలిపి మొత్తం 31 మంది మరణించినట్టు నేపాల్ అధికారులు ధ్రువీకరించారు.

**750 మంది గల్లంతు**

ఈ ఆకస్మిక వరదల్లో సుమారు 750 మంది ప్రయాణికులు గల్లంతయ్యారు. అందులో వంద మందికి పైగా భారతీయులు, ఎన్నారైలు ఉన్నారు. తెలుగువారు సురక్ష?తంగా ఉన్నట్టు తెలుస్తోంది. గల్లంతైన భారతీయుల్లో కనీసం 59 మంది కైలాస మానససరోవర్ యాత్రకు వెళ్తున్న వారని సామ్రాట్ టూర్స్ అండ్ ట్రావెల్ ఏజెన్సీ తెలిపింది. అలాగే 44 మంది నేపాల్ ఆర్మీ సిబ్బందితో సహా మొత్తం 80 మంది భద్రతా సిబ్బంది కూడా గల్లంతయ్యారు. గల్లంతైన వారి కోసం నేపాల్ ఆర్మీ రంగంలోకి దిగింది. హెలికాప్టర్లు, విపత్తు నిర్వహణ బృందాలను ప్రభావిత ప్రాంతాలకు తరలించి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని హెచ్చరికలు జారీ చేశారు.

**దెబ్బతిన్న జలవిద్యుత్ ప్రాజెక్టులు**

వరద ఉధృతికి 42 కిలోమీటర్ల మేర రహదారి కొట్టుకుపోవడంతో పాటు, 13 జలవిద్యుత్ ప్రాజెక్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పరిస్థితిని సమీక్షించిన నేపాల్ ప్రధాని బాలేంద్ర షా అత్యవసర సహాయక చర్యలకు ఆదేశించారు. నేపాల్ సైన్యం 12 హెలికాప్టర్లు, డ్రోన్లు, స్నిఫర్ డాగ్స్‌తో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టి సుమారు 80 మందిని రక్షించింది. నదికి అడ్డుపడిన ప్రదేశంలో నీరు ఇంకా పూర్తిగా బయటకు వెళ్లకపోవడంతో భోటేకోశీ, త్రిశూలి నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

**స్తంభించిన రాకపోకలు**

భారీ వరద ప్రవాహంలో అనేక వాహనాలు, స్థానిక కస్టమ్స్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న విలువైన సరుకులు కొట్టుకుపోయాయి. ఇటీవల కొత్తగా నిర్మించిన ఒక వంతెన సైతం వరద ఉధృతికి కొట్టుకుపోయినట్లు రసువా కస్టమ్స్ అధికారులు వెల్లడించారు. వరద ధాటికి నేపాల్ విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా ప్రభావితమైంది. ఆరు ప్రధాన విద్యుత్ కేంద్రాలు, ట్రాన్స్‌మిషన్ లైన్లు దెబ్బతిన్నాయి. నేపాల్‌లోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడిందని నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ప్రకటించింది. పలు కీలక రహదారులు కొట్టుకుపోవడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి.

**అత్యవసర సమావేశం**

విపత్తు తీవ్రత దృష్ట్యా నేపాల్ ప్రధాని బాలేంద్ర షా జాతీయ విపత్తు నిర్వహణ సంస్థతో అత్యవసర సమావేశం నిర్వహించారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని, మెడికల్ బృందాలు, స్కౌట్స్, రెడ్‌క్రాస్ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ బాధితులకు తక్షణ సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. సహాయం కోసం నేపాల్ పర్యాటక బోర్డు టోల్ ఫ్రీ నంబర్ 1234 లేదా హాట్‌లైన్ 1144 లేదా పర్యటక పోలీసుల నంబర్ 9851289445ను కూడా జారీ చేసింది.

**భారత్‌హెల్ప్‌లైన్**

నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం కూడా 0977 985 131 6807, 0977 970 910 7500 హెల్ప్‌లైన్ నంబర్లును జారీ చేసింది. మరోవైపు నేపాల్‌కు సరిహద్దులో ఉన్న బీహార్, యూపీలకు కేంద్రం అడ్వైజరీలు జారీ చేసింది. గండక్ నది పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిస్థితి నిశితంగా పర్యవేక్షించాలని అధికారులకు సూచించింది. బీహార్ సీఎం సమ్రాట్ చౌధరీతో కేంద్ర హోంమంత్రి అమిత్? షా మాట్లాడారు.

## తాడేపల్లిలో వైఎస్ జగన్‌ను కలిసిన వైసీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ జనరల్ సెక్రెటరీ సాధత్ అలీ ఖాన్

**అమరావతి - సూర్య వాస్తవం :** వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర మైనార్టీ సెల్ జనరల్ సెక్రెటరీగా ఎన్నికైన నాయకులు సాధత్ అలీ ఖాన్ బుధవారం నాడు మర్యాదపూర్వకంగా కలిశారు.



# సంపాదకీయం

## మోదీ మాస్టర్ స్ట్రోక్!




భారత రాజకీయ ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చేసే కీలకమైన 'జమిలి ఎన్నికల' విధానంపై మరోమారు చర్చ మొదలైంది. 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటే తమ సర్కారు అధికారంలో ఉన్న 22 రాష్ట్రాలు, యూటీల శాసన సభ ఎన్నికలను కలిపి నిర్వహించడానికి కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తున్నది. భారత ఎన్నికల వ్యవస్థలో పెద్ద మార్పు తీసుకురావాలనే ప్రయత్నం కొన్ని నెలలుగా కొనసాగుతోంది. లోక్‌సభ, విధానసభల ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలనే 'వన్ నేషన్-వన్ ఎలక్షన్' ప్రతిపాదనపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) చర్చలు తీవ్రమవుతున్నాయి. కమిటీ ఛైర్మన్ పీపీ చౌదరి ఇటీవలి అప్‌డేట్‌లో స్టేక్‌హోల్డర్లలో అధిక శాతం మద్దతు ఉందని, 2034కు బదులు 2029లోనే అమలు చేయవచ్చని సూచించారు. ఇదే ఇప్పుడు చర్చనీయాంశం అయింది. జేపీసీ ఛైర్మన్ పీపీ చౌదరి ప్రకారం, ఇప్పటివరకు సంప్రదించిన సివిల్ సొసైటీ, నిపుణులు, వివిధ సంస్థల్లో సుమారు 99 శాతం మంది జమిలి ఎన్నికలకు అనుకూలంగా మాట్లాడారు. కమిటీ పలు రాష్ట్రాల్లో పర్యటించి అభిప్రాయాలు సేకరిస్తోంది. రాజ్యాంగ సవరణ 2028లోగా పూర్తయితే, 2029 లోక్‌సభ ఎన్నికలతోపాటు కొన్ని విధానసభలను కలిపి నిర్వహించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల సమ్మతి కీలకం. కొన్ని రాష్ట్రాలు తమ అసెంబ్లీలను ముందస్తుగా రద్దు చేసి చక్రం సరిపోల్చుకుంటే మరింత సులభమవుతుంది. దేశంలోని 17 రాష్ట్రాల్లో బీజేపీ సొంతంగా అధికారంలో ఉన్నది. మరో ఐదు రాష్ట్రాల్లో బీజేపీ మిత్ర పక్షాలు అధికారంలో ఉన్నాయి. అలా మొత్తంగా 22 రాష్ట్రాల్లో ఎన్డీయే ప్రభుత్వాలే ఉన్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలు జరుగడానికి ముందే ఎన్డీయే పాలిత 11 రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరుగనున్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటే మరో నాలుగు ఎన్డీయే రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. మిగతా ఏడు ఎన్డీయేపాలిత రాష్ట్రాల ఎన్నికలు 2030-31 మధ్య జరుగనున్నాయి. దీంతో జమిలి ఎన్నికల కోసం తమ రాష్ట్రాల్లోని ప్రభుత్వాల పాలనను వెనక్కి కానీ ముందుకు కానీ జరుపుకునేందుకు పెద్దగా అభ్యంతరాలు ఉండకపోవచ్చని ఎన్డీయే సర్కారు భావిస్తున్నది. 2029లో ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, సిక్కిం, హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఉండడంతో 'జమిలి' ప్రక్రియకు పెద్దగా ఇబ్బందులు ఎదురు కావడం లేదు. అయితే 2028లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, త్రిపుర, తెలంగాణ, మేఘాలయ, నాగాలాండ్, మిజోరం అసెంబ్లీల గడువు ముగుస్తున్నది. జమిలి ఎన్నికల కోసం ఆయా అసెంబ్లీల కాలాన్ని 5 నెలల నుంచి ఏడాది వరకు పొడిగించాల్సి ఉంటుంది. ఇక బీహార్, ఢిల్లీ, తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీల గడువు 2030-31లో ముగియనున్నది. వాటి గడువును ఒకటి నుంచి రెండేండ్లు తగ్గించాల్సి వస్తుంది. అయితే, ఇంతటి భారీ సంస్కరణకు పార్లమెంట్ శాసనపరమైన మార్పులు చేయడంతో పాటు విస్తృత రాజకీయ ఏకాభిప్రాయం అవసరమవుతుంది. ఈ ప్రతిపాదనను జార్ఖండ్, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న విపక్ష ప్రభుత్వాలు పెద్దయెత్తున వ్యతిరేకించే అవకాశం ఉన్నది. ఈ క్రమంలోనే తొలుత తాము అధికారంలో ఉన్న 22 రాష్ట్రాల్లో జమిలి ప్రక్రియను కొనసాగించడానికి ఎన్డీయే ప్రభుత్వం కార్యచరణ సిద్ధం చేసినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయిగతంలో 2034ని లక్ష్యంగా చెప్పినా, ఇప్పుడు ముందుకు తీసుకురావాలనే ఆలోచన బలపడుతోంది. ఇది రెండు దశల్లో అమలు కావచ్చు. సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు పి. చిదంబరం, ప్రియాంకా గాంధీ వాద్రా, సాగరికా ఘోష్, సుప్రియా సూలే తదితరులు పాల్గొన్నారు. చిదంబరం బలంగా వ్యతిరేకించారు. ప్రస్తుత రూపంలోని ప్రతిపాదన రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని దెబ్బతీస్తుందని, పార్లమెంటరీ ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని వాదించారు. ఎన్నికైన అసెంబ్లీల పదవీకాలాన్ని తగ్గించడం సమస్యాత్మకమని అభిప్రాయపడ్డారు. మరోవైపు పద్మ అవార్డు గ్రహీతలు, కొన్ని పాలసీ గ్రూపులు జాతీయ ప్రయోజనంగా చూశారు. అయితే తగిన రక్షణలు, స్పష్టమైన నిబంధనలు అవసరమని సూచించారు. ఎన్నికల కమిషన్‌కు అధిక అధికారాలు రాకుండా జాగ్రత్తలు కావాలని కూడా అభిప్రాయాలు వచ్చాయి. మద్దతుదారులు పదేపదే ఎన్నికల వల్ల జరిగే ఆర్థిక నష్టం, అభివృద్ధి పనుల్లో అంతరాయం, మోడల్ కోడ్ వల్ల పాలనా స్తబ్దతను ఎత్తి చూపుతున్నారు. జమిలి ఎన్నికలు ఖర్చు తగ్గించి, పాలనకు స్థిరత్వం ఇస్తాయని వాదిస్తున్నారు. ఇక వ్యతిరేకులు ఫెడరల్ వ్యవస్థ బలహీనపడే ప్రమాదం, ప్రాంతీయ సమస్యలు జాతీయ అంశాల్లో కలిసిపోయే అవకాశం, చిన్న పార్టీలపై ప్రభావం లాంటి వాటిని లెక్కపెడుతున్నారు. జేపీసీ నివేదిక శీతాకాల సమావేశం వరకు వాయిదా పడింది. రాజకీయ సమ్మతి ఏర్పడితే 2029లో పాక్షికంగా అయినా అమలు సాధ్యమే. లేకపోతే 2034 వైపు వెళ్తుంది. ఈ ప్రతిపాదన భారత ప్రజాస్వామ్య పనితీరును పునర్నిర్మించే ప్రయత్నం. సమ్మతి, రాజ్యాంగ రక్షణలు, రాష్ట్రాల సహకారం లేకుండా ముందుకు సాగడం కష్టం. భవిష్యత్ దిశను నిర్ణయించేది పార్లమెంట్ చర్చలు, రాజకీయ సంకల్పమే. కుల గణన విధానంపై విశ్లేషకులు, కార్యకర్తలు, రాజకీయ నేతలతో 'స్క్రోల్' సంస్థ మాట్లాడినప్పుడు పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. వారిలో అధికశాతం మంది కులాలను లెక్కించేందుకు ఎన్నుకున్న పద్ధతి లోపభూయిష్టమని అన్నారు. ఇటీవల బీహార్, తెలంగాణ తదితర రాష్ట్రాలు కులగణన నిర్వహించినప్పుడు 2011 మోడల్‌కు కట్టుబడి ఉండాలనే మోదీ ప్రభుత్వ నిర్ణయాన్ని వారు ప్రశ్నించారు. జనాభా లెక్కల్లో సేకరించే కుల డేటా నిరుపయోగంగా మారుతుందని కొందరు విమర్శకులు వాదించారు. 2021 సెప్టెంబర్ 21న మోదీ ప్రభుత్వం కుల గణన పిటిషన్‌ను తిరస్కరిస్తూ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. అఫిడవిట్‌లోని 12(డి) పేరాలో '2011 జనాభా లెక్కల నిర్వహణకు ముందు కులాల రిజిస్ట్రీ ఏదీ సిద్ధం చేయలేదు' అని ఉంది. కాగా కులగణన కోసం ఎన్యూమరేటర్లు మొదట ప్రజలను షెడ్యూల్ కులాలు(ఎస్సీ) లేదా షెడ్యూల్ తెగలకు(ఎస్టీ) చెందినవారా కాదా అని అడుగుతారు. ఈ సమయంలో ప్రజలు తమ కులాన్ని ప్రకటించడానికి ఇష్టపడటం లేదని చెప్పే అవకాశం కూడా ఉందని 'ది హిందూ' పేర్కొంది. కాగా కులంపై పరిమితులు లేని ప్రశ్నలు ఉండటం వలన వైవిధ్యంతో కూడిన సమాధానాలు వస్తాయని ఇది అర్థవంతమైన విశ్లేషణను అందించదని విమర్శకులు వాదిస్తున్నారు. 2001 నుంచి జనాభా లెక్కల్లో కులం లెక్కింపుపై వాదన చేస్తున్న సామాజిక శాస్త్రవేత్త సతీశ్ దేశ్ పాండే దీనిని ప్రణాళికాబద్ధమైన వైఫల్యం అని పేర్కొన్నారు. కులం గురించి పలు ప్రశ్నలు అడగడం వల్ల ఒకే సమాజానికి చెందిన వారు వేర్వేరు కులాల పేర్లతో తమను తాము గుర్తించుకునే అవకాశం ఉంది.



- మురుగు కాలువల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు
- ప్లాస్టిక్ నిషేధం ప్రచారానికే పరిమితం..
- విచ్చలవిడిగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం
- వర్షం వస్తే రోడ్లపైకి మురుగునీరు..
- కాలువలపై అక్రమ నిర్మాణాలతో మరింత ముప్పు

# ప్లాస్టిక్ పాపం...డ్రైనేజీలకు శాపం..!

అనంతపురం కార్పొరేషన్ - సూర్య వాస్తవం :

నగరం లోని త్రివేణి సమీపంలోని డ్రైనేజీ కాలువ, సోమనాథ్ నగర్‌లోని మరువ వంక కాలువ, పెన్నార్ భవన్ పక్కన ఉన్న కాలువతో పాటు పలు నివాస ప్రాంతాల్లోని మురుగు కాలువలు గత పది రోజులుగా దుర్గంధం వెదజల్లుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్లాస్టిక్, థర్మోకోల్, ఇతర ఘన వ్యర్థాలు కాలువల్లో పేరుకు పోవడంతో మురుగునీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో కాలువల నుంచి మురుగునీరు రోడ్లపైకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ వర్షం కురిసిన సమయంలో కాలువలు పొంగిపొర్లితే లోతట్టు ప్రాంతాల్లోని నివాసాల్లోకి మురుగునీరు చేరే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కాలనీల్లో ఏకంగా కాలువలపైనే నిర్మాణాలు చేపట్టడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తోందని వారు పేర్కొంటున్నారు.

### ప్రచారానికే పరిమితమైన ప్లాస్టిక్ నిషేధం

"ప్లాస్టిక్ నిషేధం" అనే నినాదం ప్రకటనలు, ప్రచార కార్యక్రమాలకే పరిమితమవుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు. మార్కెట్లు, రహదారుల వెంట ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లు, ఫ్లెక్సీలు, ఇతర వ్యర్థాలు కనిపిస్తున్నాయని చెబుతున్నారు. ముఖ్యంగా పండుగలు, జాతరలు, పుట్టినరోజులు, రాజకీయ నాయకుల పర్యటనల సందర్భంగా భారీగా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయడం పరిపాటిగా మారింది. రహదారులు, కూడళ్లు, వంతెనలు, వీధులు అనే తేడా లేకుండా ప్రచార సామగ్రిని ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు అసౌకర్యం కలుగుతోంది. ఈ ఆర్భాట ప్రచారానికి వెచ్చించే నిధుల్లో కొంతైనా డ్రైనేజీల పూడికతీత, పారిశుధ్య పనులకు వినియోగిస్తే నగరానికి మేలు జరుగుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

### ప్లాస్టిక్‌తో విడదీయరాని బంధం

మన దైనందిన జీవితంలో ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. చెప్పులు, పెన్నులు, దువ్వెనలు, నీటి బాటిళ్లు, ప్లేట్లు, ఆహార ప్యాకేజింగ్ తదితర అనేక వస్తువుల్లో ప్లాస్టిక్ వినియోగం విస్తృతంగా ఉంది. మార్కెట్‌కు వెళ్లేటప్పుడు పునర్వినియోగ సంచులు తీసుకెళ్లే అలవాటు తగ్గిపోయింది. మాంసం, చికెన్ వంటి వాటిని కొనుగోలు చేసేటప్పుడు కూడా పునర్విని యోగ పాత్రలను వినియోగించకుండా వరుసగా ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేయించుకునే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా సింగిల్-యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించకపోతే పర్యావరణంపై దీర్ఘకాలిక ప్రభావం తప్పదని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. రోడ్లపై, చెత్తకుప్పల్లో



పడేసిన ప్లాస్టిక్ కవర్లను పశువులు ఆహారంతో పాటు మింగుతున్నాయి. ప్లాస్టిక్‌ను జీర్ణించుకోలేక అవి తీవ్ర అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంది. మరోవైపు కాలువల్లోకి చేరుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడంతో మురుగునీరు నిలిచిపోతోంది. దీంతో దోమలు, ఈగలు ఇతర కీటకాలు పెరిగేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడి ప్రజారోగ్యానికి ముప్పు కలిగే అవకాశం ఉంది.

### ప్రతి శుభకార్యానికి ఒక ట్రాక్టర్ వ్యర్థాలా?

శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాలు ముగిసిన తర్వాత ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, కవర్లు, వాటర్ బాటిళ్లు, థర్మోకోల్ తదితర వ్యర్థాలు భారీగా పేరుకుపోతున్నాయి. కొన్ని కార్యక్రమాల్లో ఒక్క రోజులోనే ట్రాక్టర్ నిండా వ్యర్థాలు పేరుకుపోయే పరిస్థితి కనిపిస్తోంది. ప్లాస్టిక్ వస్తువులన్నింటినీ ఒక్కసారిగా తొలగించడం సాధ్యం కాకపోయినా, పలుచని ప్లాస్టిక్ సంచులు, సింగిల్-యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని దశలవారీగా తగ్గించాల్సిన అవసరం ఉంది. ఇందుకు దుకాణదారులు, వినియోగదారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలి.

### కఠిన చర్యలు అవసరం

డ్రైనేజీ కాలువలను తక్షణమే శుభ్రపరిచి, పేరుకుపోయిన పూడిక, ప్లాస్టిక్, థర్మోకోల్ తదితర వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. కాలువల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధించాలని సూచిస్తున్నారు. సింగిల్-యూజ్ ప్లాస్టిక్ సంచుల వినియోగంపై నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని, వ్యాపారులు వస్త్రం, కాగితం లేదా పునర్వి నియోగ సంచులను అందుబాటు లోకి తీసు కురావాలని కోరుతు న్నారు. ప్రజలు కూడా మార్కెట్‌కు వెళ్లేటప్పుడు పునర్విని యోగ సంచులను వెంట తీసుకెళ్లే అలవాటును పెంపొందించు కోవా



ల్సిన అవసరం ఉంది. ప్లాస్టిక్ సమస్య కేవలం పారిశుధ్య సమస్య మాత్రమే కాదని, అది ప్రజారోగ్యం, పర్యావరణం, జీవావరణం, భవిష్యత్ తరాల జీవన ప్రమాణాలకు సంబంధించిన అంశమని రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డా. ముచ్చుకోట సురేష్‌బాబు, కార్యదర్శి బాయినేని నాగేంద్ర ప్రసాద్, అధ్యక్షులు ప్రొ. గంగంపల్లి వెంకటశివారెడ్డి తదితరులు పేర్కొన్నారు.

### "ప్లాస్టిక్ వాడకం తగ్గిద్దాం..

డ్రైనేజీలను కాపాడుదాం.. పరిశుభ్రమైన నగరాన్ని నిర్మిద్దాం" అనే సంకల్పంతో అధికారులు, ప్రజాప్రతినిధులు, పౌర సమాజం, ప్రజలు సమిష్టిగా ముందుకు రావాల్సిన సమయం ఆసన్నమైందని వారు కోరారు.

### ప్రజల బాధ్యత ఏమిటి?

- డ్రైనేజీ కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, థర్మోకోల్ తదితర చెత్త వేయకూడదు.
- ఇంటి చెత్తను మురుగు కాలువల్లోకి లేదా రోడ్లపైకి వేయకుండా, మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకు అందించాలి.
- మార్కెట్‌కు వెళ్లేటప్పుడు పునర్వినియోగ వస్త్ర సంచులను ఉపయోగించాలి.
- శుభకార్యాలు, పుట్టినరోజులు, సామాజిక కార్యక్రమాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి.
- కాలువల్లో చెత్త వేస్తున్న వారికి అవగాహన కల్పిస్తూ నిరోధించాలి.
- డ్రైనేజీలు, పారిశుధ్య సమస్యలను సంబంధిత మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.
- కాలువలపై అక్రమ నిర్మాణాలు లేదా ఆక్రమణలు కనిపిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలి.
- "ప్రభుత్వం శుభ్రం చేయాలి" అనే బాధ్యతతో పాటు "మనమే చెత్త వేయకూడదు"

అనే బాధ్యతను కూడా ప్రజలు తీసుకోవాలి.

## టీడీపీ కార్యకర్త కుటుంబానికి

# రూ.5 లక్షల ప్రమాద బీమా అందజేత

డోన్ - సూర్య వాస్తవం : డోన్ నియోజకవర్గం ప్యాపిలి మండలం ఎన్. రంగాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కొప్పెల సురేంద్ర ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. టీడీపీ సభ్యత్వం ద్వారా మంజూరైన రూ. 5 లక్షల ప్రమాద బీమా పత్రాలను ఆయన కుటుంబ సభ్యులకు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. "కార్యకర్తలే పార్టీకి బలం.. వారి కుటుంబాలే మా బాధ్యత" అని అన్నారు. కార్యకర్తలకు పార్టీ సభ్యత్వం ద్వారా ప్రమాద బీమా కల్పిస్తూ, ఆపద సమయంలో వారి కుటుంబాలకు టీడీపీ అండగా నిలుస్తోందని తెలిపారు.

టీడీపీ కార్యకర్తల సంక్షేమానికి పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీ నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యకర్తల కుటుంబాలకు కష్టకాలంలో ఆర్థిక భరోసా కల్పించేలా టీడీపీ సభ్యత్వం ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు.



## మానవత్వం చాటుకున్న మార్గ్స్ ఫౌండేషన్...!

- పోలేపల్లి గ్రామంలో పక్షవాతంతో బాధపడుతున్న కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయం
- ఆపదలో ఉన్న కుటుంబాలకు చేయూత అందించడమే మా లక్ష్యం: చియ్యేడు గోపాల్



**అనంతపురం రూరల్ – సూర్య వాస్తవం :** శ్రీ సత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన చింతాకు ఆంజనేయులు పక్షవాతంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం గ్రామస్తుల ద్వారా మార్గ్స్ ఫౌండేషన్ సభ్యుల దృష్టికి వచ్చింది.విషయం తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు ఆంజనేయుల కుటుంబ పరిస్థితిని పరిశీలించి, బుధవారం ఉదయం మార్గ్స్ ఫౌండేషన్ తరఫున రూ.20,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు చియ్యేడు గోపాల్ మాట్లాడుతూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు తమ వంతు సహాయం అందించడం ద్వారా వారికి కొంతైనా ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఈ సహాయం చేసినట్లు తెలిపారు. అనంతరం గ్రామ మాజీ సర్పంచ్ ఓబిరెడ్డి మాట్లాడుతూ, తమ విజ్ఞప్తికి వెంటనే స్పందించి పోలేపల్లి గ్రామానికి వచ్చి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన మార్గ్స్ ఫౌండేషన్ సభ్యులకు గ్రామస్తుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా మరెంతో మంది నిరుపేదలు, ఆపదలో ఉన్న కుటుంబాలకు ఫౌండేషన్ చేయూత అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మార్గ్స్ ఫౌండేషన్ సభ్యులు దాసరి మోహన్ బాబు, కుంటిమద్ది రమేష్, చియ్యేడు గోపాల్, చిన్నపల్లి సోమశేఖర్ రెడ్డి, విజయ్ కుమార్‌తో పాటు మాజీ సర్పంచ్ ఓబిరెడ్డి, మాజీ ఎంపీపీ సుజాత ఆది రెడ్డి, బోయ సూరి, కొండాపురం మాజీ సర్పంచ్ రామ్మూర్తి, నసనకోట రామాంజనేయులు, జై రామ్ రెడ్డి, సీపీ నారాయణ, పోలేపల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మెగా రక్తదాన శిబిరం

- 85 మంది స్వచ్ఛందంగా రక్తదానం



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలోని గాంధీ సర్కిల్ వ ద్ద బుధవారం మిలాదూన్ నబీ ప ర్వదినాన్ని పురస్కరించుకుని రెడ్ ప్లస్ ఆధ్వర్యంలో మెగా రక్తదానశి బిరాన్ని ఘనంగా నిర్వహించారు. రెడ్ ప్లస్ వ్యవస్థాపకుడు సయ్యద్ షేక్షావలి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.కుల మతాలకు అతీతంగా పలువురు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ శిబిరంలో దాదాపు 85 మంది రక్తదానం చేసి మానవతా విలువ లను చాటుకున్నారు.ప్రతి ఒక్క ర క్తదాతకు 3లక్షల ప్రభుత్వ బీమా ప థకాన్ని కూడా సంస్థ ద్వారా చేయిం చారు.రక్తదానం చేయడం ద్వారా అ త్యవసర సమయంలో రక్తం అవస రమైన వారికి ప్రాణదానం చేసినట్ల వుతుందని నిర్వాహకులు తెలిపా రు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థులుగా గుత్తి మున్సిపల్ కమిషన ర్ జబ్బర్ మియా,డిప్యూటీ తహసీ ల్దార్ సూర్యనారాయణ,హ్యాండ్స్ సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధి కారి నారాయణస్వామి పాల్గొని రక్తదాతలను అభినందించారు. యువతతో పాటు వివిధ వర్గాలకు చెందిన వారు స్వచ్ఛందంగా రక్తదానం చేయ డం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెడ్ ప్లస్ వ్యవస్థాపకుడు సయ్యద్ షేక్షావలి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా భావంతో రక్తదానం చేయాలని పిలు పునిచ్చారు.ఒక వ్యక్తి రక్తదానం చే యడం ద్వారా మరో వ్యక్తి ప్రాణాన్ని కాపాడే అవకాశం ఉంటుందని తెలి పారు.ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్క రూ క్రమం తప్పకుండా రక్తదానం చే సి ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాఫిర్,మున్నా,కాజా మైనుద్దీన్,నా గదని భారత్, హరి, హబీబ్, సులేమాన్, రాముస్వామి, అజామ్ ఖాన్, యశ్వంత్, భార్గవ్ సాయి, సమీర్, షాజా ఫర్ తదితరులు పాల్గొని రక్తదాన శి బిరాన్ని విజయవంతం చేశారు.రక్త దానం చేసిన ప్రతి ఒక్కరికీ నిర్వా హకులు కృతజ్ఞతలు తెలిపారు. మి లాదూన్ నబీ సందర్భంగా నిర్వహించిన ఈ రక్తదాన శిబిరం మతసామరస్యం, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచిందని పలువురు పేర్కొన్నారు.

## కుమార్తె వివాహానికి హాజరై ఆశీర్వదించండి

- గుంతకల్లు నియోజకవర్గం శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి ఉమ్మడి అనంతపురం జిల్లా, కర్నూల్ జిల్లా కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, మిత్రులు శ్రేయోభిలాషులు అందరు తప్పకుండ ఈనెల 30వ తారీఖున అనంతపురం పట్టణంలో జరగబోయే తన కుమార్తె వివాహానికి విచ్చేయాలని గుంతకల్లు నియోజకవర్గం శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం సోషల్ మీడియా ద్వారా ఆహ్వానించారు. తన వ్యక్తి గత కారణాల వల్ల అందరిని నేరుగా వచ్చి ఆహ్వానించలేకపోతున్నానని కాబట్టి ఇదే ఆహ్వానంగా భావించి అందరు తన కుమార్తె వివాహానికి హాజరై ఆశీస్సులు అందించాలని కోరారు.

# ఉపాధి హామీ పనులలో అక్రమాలు...!

**- ఉపాధి'లో అవినీతిపై చర్యల్లేవు**



**పామిడి – సూర్య వాస్తవం :** పామిడి మండలంలోని ఉపాధి హామీ పథకంలో చోటు చేసుకున్న అవినీతిపై అక్రమాలు అవకతవకలు జరుగుతున్నాయంటూ ప్రజా సమస్యలపరిష్కార వేదిక ( పిజిఆర్ఎస్, గ్రీవెన్స్) ద్వారా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉపాధి హామీ పథకం పనుల్లో అర్హతలేని వ్యక్తులను కూలీలుగా నమోదు చేయడం, పనులు చేయకుండానే వేతనాలు చెల్లించడం వంటి ఆరోపణలను జూలై 14న జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడమైనదని, ఫిర్యాదుదారుడు పేర్కొన్నారు. ఎస్ఎల్ఎ రోజుల సంఖ్య 30 రోజులలో పరిశీలించి పరిష్కారం చేయాలని జిల్లా అధికారులు గడువు ఇచ్చారు. ఆ గడువు దాటిపోయి రెండు వారాలు కావస్తున్నా పరిష్కారం జరగలేదన్నారు. ఈ వ్యవహారంపై అధికారులు పరిశీలన చేపట్టినట్లు పత్రంలో పేర్కొన్నారు. పరిశీలనలో పలు జాబ్‌కార్డులకు సంబంధించి వేతనాల చెల్లింపులు జరిగినట్లు గుర్తించినట్లు వివరించారు. కొన్ని పనులకు సంబంధించి చెల్లింపుల వివరాలను కూడా అధికారులు నమోదు చేశారు. 2024 నుంచి గ్రామస్థాయిలో మరింత సమగ్రంగా విచారణ జరిపితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఫిర్యాదుదారు విజ్ఞప్తి చేశారు. 2024లో అప్పటి ఎంపీడీవో తేజోశ్నకు ఎన్నో దఫాలుగా ఫిర్యాదు ఇచ్చిన ఆమె పట్టించుకోలేదన్నారు. సంబంధిత అధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టి ఫీల్డ్ అసిస్టెంట్ జిట్టా సుమన్, టెక్నికల్ అసిస్టెంట్లు, అలాగే ఏపీవో,ఎంపీడీవో,లు తదితర ఉపాధి హామీ పథకం యంత్రాంగం అంతయు కుమ్మక్కై ప్రభుత్వాలను ఉపాధి పనులను ప్రక్కదోవ పట్టిస్తున్నారని అవినీతి అక్రమాలకు అంతే లేకుండా ఉందని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఈ ఫిర్యాదు "ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి ఉంది" అనే స్థితిలో ఉన్నట్లు పత్రంలో పేర్కొన్నారు. ఈ నిర్లక్ష్యాన్ని బట్టి ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఆపై అధికారులు అందరూ కుమ్మక్కై అక్రమాలు, అవినీతిని తొక్కేస్తున్నారని ఆ గ్రామంలోని మేధావులు విద్యావంతులు విమర్శలు గుప్పిస్తున్నారు. వీరి నిర్లక్ష్య వైఖరిని జిల్లా అధికారులు గుర్తించి వీరిపై కఠిన చర్యలు తీసుకొని ప్రభుత్వ ఖజానాకు తోడ్పడవలసిందిగా కోరుచున్నారు.

# ఘనంగా మదర్ థెరిసా 116వ జయంతి





**పామిడి – సూర్య వాస్తవం :** మదర్ థెరిసా జయంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, ఆధ్యాత్మిక చింతనాత్మకుడు వై యు రామాంజనేయులు బుధవారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి స్వర్గంలో ఆమె ఆత్మకు ఎల్లప్పుడు శాంతి నిలయమై ఉండాలని ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒట్టోమన్ సామ్రాజ్యంలో భాగమైన స్కోప్జేలో 1910, ఆగస్టు 26న జన్మించారని, ఆమె నిస్వార్థ మానవ సేవకు గాను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక ప్రతిష్టాత్మక అవార్డులను గెలుపొందారు. 1962లో పద్మశ్రీ అవార్డు భారతదేశంలోని అందుకున్న మొదటి పౌర పురస్కారం, అలాగే రామన్ మెగసేన అవార్డు అంతర్జాతీయ సేవలకు గుర్తింపుగా లభించింది అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ అవార్డు అంతర్జాతీయ అవగాహన కోసం లభించిందన్నారు. సంథింగ్ బ్యూటిఫుల్ ఫర్గాట్ అనే పుస్తకం రచించి డాక్యుమెంటరీ ద్వారా 1970 నాటికి మానవతా వాదిగా పేద ప్రజలు నిసహాయకులకు అనుకూల రాలుగా అంతర్జాతీయ కీర్తి పొందిందని, టెంపుల్టన్ బహుమతి 1973లో మతపరమైన ఆధ్యాత్మిక పురోగతికి మొదటిసారిగా ఈ బహుమతి ఆమెకు దక్కిందన్నారు. చాలా మానవ సేవకు గాను 1979లో నోబుల్ శాంతి పురస్కారాన్ని, 1980లో భారత దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న పొందిదన్నారు. 1997 సెప్టెంబర్ 5న ఆమె చనిపోయారు.ఆమె వయసు 87 ఏళ్ళు ఆనాటికి 123 దేశాలలో 610 సంఘాలను కలిగి హెచ్ఐవి,ఎయిడ్స్, కుష్టు క్షయ వ్యాధిగ్రస్తులకు ధర్మశాలలను గృహాలను ఆహార కేంద్రాలను. అనాధ శరణాలయాను, పాఠశాలలో స్థాపించింది అన్నారు అదే అనేక దేశాల నుంచి ప్రశంసా పత్రాలు అవార్డులు సంబరాలు వందల కొలది పొందారని, ఈ మహాత్మురాలు తిరిగి మన భారత దేశంలోని ఆంధ్రాలో జన్మించాలని దేవతలు అందరిని ప్రార్థించు చున్నానన్నారు. అలాగే మిలాద్ఉన్ నబీ పండుగ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులందరికీ ఆయన యొక్క ప్రత్యేక శు భాకాంక్షలు తెలిపారు.

**గుత్తిలో....** గుత్తి పట్టణంలోని ఫుట్బాల్ గ్రౌండ్లో పెన్షనర్స్ భవనంలో మదర్ థెరిస్సా జయంతిని పెన్షనర్స్ అసోసియేట్ ప్రెసిడెంట్ స్వర్ణాంబా, కోశా ధికారి జెన్నే కుల్లాయిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు. ముందుగా మదర్ థెరిస్సా చిత్ర పటానికి కోశాధికారి జెన్నే కుల్లాయి బాబు, సెక్రెటరీ రామ్ మోహన్ పూల మాల వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ మదర్ థెరిస్సా అసలు పేరు అంజెజ్ గొంజే(లేదా గొంజే)గొంజే అంటే అల్బేనియన్ భాషలో పు వ్వు మొగ్గ అని అంటారు. వీరు దరిద్రంలో మగ్గుతున్న వారికి దారి చూపుతుంది. ఆకలితో అలమ టిస్తున్న వారికి ఆహారం అందిస్తుంది. రోగములతో ఉన్న వారికి మందులు ఇస్తుంది.మృ త్యువు సమీపించిన వారికి భయపడకు,భాద పడకు దై వ సన్నిధికి వెల్లుచున్నావు. ప్రశాంతంగా వుండు. నీకు నేనున్నాను అని ధైర్యం చె ప్పారు.ఆకలి గొన్న వారిలో రోగులలో దుఃఖ పీడితుల లో దైవాన్ని చూస్తూ సేవ చేయగలిగిన ఆ విశ్వమాత చ రిత్ర గురించి తెలుసు కుంటే మనలోను సేవాభావము క లుగుతుంది.మానవ సేవ్ మాధవ సేవ అని మనము కూడా సాటి మనుషులకు సేవ చేసే వైపు మొగ్గుతాము అని కోశాధికారి జెన్నే కుల్లా యిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ స్వర్ణాంబా, కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు, సెక్రటరీ రామ్ మోహన్, వెంకట సుబ్బమ్మ, నారాయణ రెడ్డి, గోవిందప్ప, నారాయణ శెట్టి, మద్దులేటి, శామ్యూల్, హస్సన్ అహమ్మద్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

# హోరా హోరీగా స్నేహపూర్వక టీచర్స్ వాలీబాల్ టోర్నమెంట్



**కదిరి – సూర్య వాస్తవం**

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఎన్ వై పి ఎస్ ఎన్ వ్యవస్థాపక చైర్మన్ మరియు సిమ్స్ హాస్పిటల్ ఎండి నిసార్ యాసిన్ ఖాన్. సౌజన్యంతో జిల్లా స్థాయి టీచర్స్ వాలీబాల్ టోర్నమెంట్ హోరాహోరీగా జరిగింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో రుద్రం రెడ్డి అధ్యక్షతన జరిగిన వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమంలో ముఖ అతిథి గా విచ్చేసిన నిసార్ యాసిన్ పాల్గొని ఉపాధ్యాయులకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు చాలా సంతోషంగా ఉందని, భవిష్యత్తులో మరికొన్ని సేవా అవకాశాలను కల్పించాలని కోరారు. విద్యాభివృద్ధికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. అనంతరం 11 జట్లకు 28 వేల రూపాయల విలువ చేసే జెర్సీలను(టి.షర్ట్స్) అందచేశారు. ప్రధానోపాధ్యాయులు వేంకటాచలం మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఇటువంటి క్రీడలు నిర్వహించి వారిని ఓ చోట చేర్చి వారిలో ఐకమత్యం, పరిచయాలకు అవకాశం కల్పించినందుకు నిసార్ యాసిన్ వాలీబాల్ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలియజేశారు. మొత్తం 11 జట్లు పోటీ పడగ గాండ్లపెంట జట్టు, కదిరి జట్లు ఫైనల్ కు చేరాయి. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్లికార్జున టాస్ ఎగురవేసి మ్యాచ్ ప్రారంభించారు. రెండు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. గాండ్లపెంట జట్టు విజయం సాధించింది.వీరికి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 05 తేదీన ట్రోఫీలను వ్యవస్థాపకుడు నిసార్ యాసిన్ తాయి గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో బహుకరిస్తారు.

ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ తాహెర్ వలి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఖాదర్ వలి, నిర్వాహకులు హరిప్రసాద్, బాబాజాన్, సందీప్,రాయుడు, హరూన్,బాబా ఫక్రుద్దీన్, నాగరాజు, కుంచెపు శ్రీనివాసులు, ఆజమ్ బాషా, అశ్వర్థ, రబ్బాని, ముబారక్, రఫీ, తో పాటు వివిధ సంఘాల యూనియన్ నాయకులు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన...!

## స్లాట్ బుక్ చేసుకున్నా.. రెండు వారాలుగా రిజిస్ట్రేషన్ చేయడం లేదని ఆవేదన
## అధికారుల తీరుపై రైతుల అగ్రహం .. స్పష్టత ఇవ్వాలని డిమాండ్

**హిందూపురం – సూర్య వాస్తవం:** చిలమత్తూరు మండల కేంద్రంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట చాగలేరు పంచాయతీకి చెందిన పలువురు రైతులు ఆందోళనకు దిగారు. తమ సొంత వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్నప్పటికీ, గత రెండు వారాలుగా రిజిస్ట్రేషన్ చేయకుండా కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.తమ భూములకు సంబంధించిన పత్రాలు సక్రమంగా ఉన్నప్పటికీ, రిజిస్ట్రేషన్ ఎందుకు నిలిపివేశారో అధికారులు స్పష్టమైన కారణం చెప్పడం లేదని రైతులు ఆరోపించారు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొంటూ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు అధికారులు లొంగి సామాన్య రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారుల నుంచి అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది.రైతుల ఆందోళనతో కొంతసేపు రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం ఏర్పడింది. ఆందోళన విషయం ముందుగానే తెలియడంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి బయటకు వెళ్లినట్లు రైతులు తెలిపారు."పత్రాలు సక్రమంగా ఉన్నప్పుడు రిజిస్ట్రేషన్ ఎందుకు చేయడం లేదు? కారణం ఏమిటో స్పష్టంగా చెప్పాలి. సామాన్య రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పడం ఆపాలి" అని రైతులు డిమాండ్ చేశారు.రైతుల ఆరోపణలపై అధికారులు స్పందించి వాస్తవ పరిస్థితిని స్పష్టం చేయాలని పలువురు కోరుతున్నారు.

## ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో
# మదర్ థెరిసా జయంతి , మహిళా సమానత్వ దినోత్సవం

**దొరవారిసత్రం –సూర్య వాస్తవం :** కర్నూలు ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో మదర్ థెరిసా జయంతి, మహిళా సమానత్వ దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఎస్ పి.ఒ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనం గా నివాళులు అర్పించారు. పేదలు, అనాథలు, నిరాశ్రయులు మరియు అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మదర్ థెరిసా చేసిన సేవలను స్మరించుకున్నారు.మానవ సేవ, కరుణ,త్యాగం వంటి విలువలను విద్యార్థులు జీవితంలో అలవర్చు కోవాలని సూచించారు. అదేవిధంగా మహిళా సమానత్వ దినోత్సవం సందర్భంగా మహిళలకు సమాజంలో పురుషులతో సమానంగా హక్కులు,అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు. మహిళలు విద్య, ఉద్యోగం,రాజకీయాలు శాస్త్ర సాంకేతిక రంగాలు, క్రీడలు తదితర అన్ని రంగాల్లో



ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు.మహిళల పట్ల గౌరవం, సమానత్వం, భద్రత, స్వావలంబన సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని తెలిపారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా కుటుంబం మాత్రమే కాకుండా సమాజం,దేశం కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు లింగ వివక్షకు దూరంగా ఉండి,ప్రతి ఒక్కరినీ గౌరవించే మంచి విలువలను పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ సూచించారు.ఈ కార్యక్రమంలో వాణి ప్రసన్న,విజయశేఖర్, జబీన్ అక్తర్,సుజాత,గిరిజా రాణి,లక్ష్మి,లావణ్య,సాయి శ్రావణి,జసిత తదితర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్దలతో మీలాద్ ఉన్ నబీ వేడుకలు...!

- జామియా మస్జిద్‌లో ప్రత్యేక ప్రార్థనలు.
- ఖురాన్ పఠనం, నాత్, సలాం కార్యక్రమాల్లో చిన్నారుల ప్రతిభ
- ప్రవక్త ముహమ్మద్ (స) ఆదర్శ జీవితం, బోధనలపై ప్రత్యేక ప్రసంగం
- జామియా మస్జిద్ నుంచి ఘనంగా మీలాద్-ఉన్-నబీ జులూస్



**పత్తికొండ టౌన్ – సూర్య వాస్తవం:** మీలాద్–ఉన్–నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని పత్తికొండలోని పెద్ద మసీదు జామియా మస్జిద్ అహ్లె సున్నత్ వల్ జమాత్‌లో బుధవారం వివిధ మతపరమైన, ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఫజర్ నమాజ్ అనంతరం దరూద్ షరీఫ్, జిక్ర్ (దైవస్మరణ), దరూద్ వ సలాం, ఫాతెహా ఖ్వానీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు కారుమంచి ఫఖ్రుద్దీన్ సాహెబ్ నిజామీ పర్యవేక్షణలో జరిగాయి. అనంతరం జామియా మస్జిద్ ఇమామ్, ఖతీబ్ హాఫిజ్ వ ఖారీ ముహమ్మద్ ఫారూఖ్ సాహెబ్ నిజామీ దువా చేశారు. అనంతరం తబర్రుకాత్ (పవిత్ర ప్రసాదం) పంపిణీ చేశారు.ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జామియా మస్జిద్‌లో ప్రత్యేక ప్రసంగంతో పాటు పిల్లల కార్యక్రమం నిర్వహించారు. హాఫిజ్ వ ఖారీ ముహమ్మద్ గౌస్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారులు ఖురాన్ పఠనం, నాత్, సలాం, సంభాషణలు, దువాలు, కలిమాలను చక్కగా ప్రదర్శించారు. ప్రతిభ కనబరిచిన పిల్లలను ప్రోత్సహిస్తూ బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ప్రవక్త ముహమ్మద్ (స) పవిత్ర జీవిత చరిత్ర, సత్ప్రవర్తన, బోధనలు, ఆదర్శ జీవితం గురించి ప్రత్యేకంగా ప్రసంగించారు. నిజాయితీ, విశ్వసనీయత, దయ, కరుణ, న్యాయం, సత్ప్రవర్తనలకు ప్రవక్త ముహమ్మద్ (స) అత్యున్నత ప్రాధాన్యత ఇచ్చారని వివరించారు. ఆయనను మక్కా ప్రజలు 'సాదిఖ్'(సత్యవంతుడు), 'అమీన్' (నమ్మకస్తుడు) అని గౌరవంగా పిలిచేవారని తెలిపారు. 40 సంవత్సరాల వయస్సులో హిరా గుహలో తొలి దివ్యవాణి అవతరించిన అనంతరం ఏకదైవా రాధన, సత్యం, ధర్మం, ప్రేమ, దయ, న్యాయం వైపు ప్రజలను ఆహ్వానించారని పేర్కొన్నారు. 622లో మదీనా మునవ్వరాకు హిజ్రత్ అనంతరం సోదరభావం, న్యాయం, శాంతి, సామాజిక సమానత్వానికి ఆదర్శంగా నిలిచే సమాజాన్ని నిర్మించారని వివరించారు. జోహర్ నమాజ్ అనంతరం అదే మసీదులో పవిత్ర అవశేషాల (ఆసార్–ఎ–ముబారక్) దర్శనానికి ఏర్పాట్లు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకున్నారు. మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు, పిల్లలకు భోజన ఏర్పాట్లు చేశారు.

అసర్ నమాజ్ అనంతరం జామియా మస్జిద్ అహ్లె సున్నత్ వల్ జమాత్ నుంచి మీలాద్–ఉన్–నబీ జులూస్ ప్రారంభమైంది. మస్జిద్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు, అక్కడి నుంచి ఫక్కు మియా దర్గా వరకు జులూస్ కొనసాగింది. దర్గా వద్ద జులూస్ ముగిసింది. పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొని ప్రవక్త ముహమ్మద్ (స) పట్ల తమ భక్తి, ప్రేమాభిమానాలను చాటుకున్నారు. జులూస్‌లో పాల్గొన్న వారికి ఫక్కు మియా దర్గా వద్ద భోజన ఏర్పాట్లు చేశారు. మీలాద్–ఉన్–నబీ సందర్భంగా నిర్వహించిన అన్ని కార్యక్రమాల్లో ముస్లిం సోదరులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.

# చికిత్స పొందుతున్న వ్యక్తి ఆచూకీ కోసం పోలీసుల సమాచారం

- మండలానికి చెందిన రామ్‌బాబు కుటుంబ సభ్యుల కోసం గాలింపు

**పెళ్లకూరు – సూర్య వాస్తవం:** పెళ్లకూరు మండలానికి చెందిన రామ్‌బాబు (35) అనే వ్యక్తి కుటుంబ సభ్యులు, బంధువుల ఆచూకీ కోసం పోలీసులు సమాచారం కోరుతున్నారు. రామ్‌బాబు తండ్రి పేరు రమేష్, తల్లి పేరు ఈశ్వరి. రామ్‌బాబు గత నాలుగు నెలలుగా చెన్నైలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఆసుపత్రి యాజమాన్యం ద్వారా సమాచారం అందినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఆయన కుటుంబ సభ్యులు, బంధువుల వివరాలు తెలియకపోవడంతో వారి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. రామ్‌బాబు కుటుంబ సభ్యులు, బంధువులు లేదా ఆయనకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు వెంటనే పెళ్లకూరు ఎస్.ఐ. 94407 96358, నాయుడుపేట రూరల్ సి.ఐ. 9440796356 నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.



ఆయనను గుర్తించేందుకు సంబంధిత వ్యక్తి ఫొటోను కూడా పోలీసులు జత చేశారు. రామ్‌బాబు గురించి ఏదైనా సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు తెలియజేసి కుటుంబ సభ్యులకు సమాచారం చేరేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# సూర్య విలేకరి ప్రకాష్‌ని పరామర్శించిన వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మెట్టు

**కనేకలు– సూర్య వాస్తవం:** కనేకల్లు భారత్ విలేకరుల సంఘం అధ్యక్షులు నేటి దినపత్రిక సూర్య విలేకరి తండ్రిగారైన రాపా జయరాముడు గత వారంలో మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే రాయదుర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త తనయుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మెట్టు విశ్వనాథరెడ్డి బుధవారం నేటి దినపత్రిక సూర్యా విలేఖరి రాపా ప్రకాష్ ను



పరామర్శించారు. అలాగే కనేకల్ మండలం రచ్చుమర్రి గ్రామం నందు వైయస్సార్సీపి నాయకుడు సన్నక్కి చిరంజీవి గత కొద్ది రోజుల కిందట బళ్ళారి సిటీ హాస్పిటల్ నందు వైద్యం చేయించుకుని ఇంటికి వచ్చి న విషయం తెలుసుకున్న మెట్టు విశ్వనాథరెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానంద రెడ్డి మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మక్బూల్ మాజీ జెడ్పిటిసి నాగిరెడ్డి బీసీ సెల్వి బాగా జిల్లా ఉపాధ్యక్షులు హళ్లి నాగరాజు ఆది సద్గురు ఫర్టిలైజర్స్ చంద్రశేఖర్ రెడ్డి శర్మాస్ మల్లికార్జున కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# శాంతి, ప్రేమ, మానవతా విలువలను ప్రపంచానికి చాటిచెప్పిన మహమ్మద్ ప్రవక్త...!

- మిలాద్-ఉన్-నబీ పవిత్ర దినం సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు పయ్యావుల కేశవ్ శుభాకాంక్షలు




**ఉరవకొండ టౌన్ – సూర్య వాస్తవం :** శాంతి, ప్రేమ, సోదరభావం, మానవతా విలువలను ప్రపంచానికి చాటిచెప్పిన మహమ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్–ఉన్–నబీ ఎంతో పవిత్రమైన దినమని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు.మిలాద్–ఉన్–నబీ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహమ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, ప్రేమ, దయ, సహనం, సోదరభావం వంటి గొప్ప విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ పవిత్ర పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖశాంతులు, సౌభ్రాతృత్వం, ఆనందాన్ని నింపాలని పయ్యావుల కేశవ్ ఆకాంక్షించారు.

# నేటి నుంచే అనంతపురం నగరంలో ఆంక్షలు...!

- శాంతిభద్రతల పరిరక్షణకు '30 పోలీస్ యాక్ట్.'
- ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, సభలకు నో
- ఉల్లంఘిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవన్న డీఎస్పీ చంద్రశేఖర్



**అనంతపురం క్రైమ్ – సూర్యవాస్తవం :** అనంతపురం అర్బన్ సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 27వ తేదీ నుంచి వచ్చే నెల 26వ తేదీ వరకు నెల రోజుల పాటు '30 పోలీస్ యాక్ట్' అమలులో ఉంటుందని అనంతపురం అర్బన్ డీఎస్పీ ఎం. చంద్రశేఖర్ తెలిపారు.ఈ మేరకు సబ్ డివిజన్ పరిధిలో ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు ముందస్తు పోలీసు అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు, ధర్నా చౌక్‌లు నిర్వహించడంతో పాటు మైకులు వినియోగించే కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. ముందస్తు అనుమతి లేకుండా నిరసనలు నిర్వహించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. పట్టణంలో ప్రశాంత వాతావరణం కొనసాగేందుకు ప్రజలు, ప్రజా సంఘాలు పోలీసు శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.

# విశిష్ట సేవకులకు ఘన సన్మానం



**దొరవారిసత్రం –సూర్య వాస్తవం :** సూళ్లూరుపేట నియోజకవర్గంలో విశిష్ట సేవలు అందించిన సీనియర్ విలేకరులకు బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఘన సన్మానం జరిగింది. సూళ్లూరుపేట ప్రైమ్ 9 రిపోర్టర్ వేలూరు రమణయ్య, నేటి సూర్య నియోజక వర్గ ఇన్ చార్జీ ఉగ్గుమూడి ఆనంద్ ల సేవలను గుర్తించిన తిరుపతి కి చెందిన ప్రజా కళావేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సన్మానం కార్యక్రమంలో రుయా సూపర్డెంట్ డాక్టర్ బాదూరు మనోహర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం,దుశ్శాలువా మరియు మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు వీరి సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు జర్నలిస్ట్ కవి, రచయిత, సేవకులు అరవ జైపాల్,తిరుపతి పాలిటెక్నికల్ విశ్రాంత లెక్చరర్ కాపిరెడ్డి కృష్ణారెడ్డి, రుయా హాస్పిటల్ ప్రొఫెసర్,సర్జన్ డాక్టర్ రోజా రమణి,ప్రజా కళావేదిక మహిళా అధ్యక్షురాలు రాళ్లపల్లి రజిని, ప్రధాన కార్యదర్శి రుక్మిణి రెడ్డి,కవిత్రిని,రచయిత్రి కరణం విమల,జగదీష్ తదితరులు పాల్గొన్నారు .

# నూతన దంపతులకు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆశీస్సులు

**పెళ్లకూరు – సూర్య వాస్తవం:** పెళ్లకూరు మండలం చెన్నప్ప నాయుడుపేట గ్రామానికి చెందిన సమాధి సుధాకర్ కుమార్తె వివాహ వేడుకకు మాజీ ఎండీసీసీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు. కుటుంబ బంధాలను పరస్పర ప్రేమ, గౌరవం, నమ్మకంతో కొనసాగించాలని వధూవరులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతుల జీవితం ఆదర్శప్రాయంగా ఉండాలని ఆకాంక్షించారు.



## మాజీ ఉపరాష్ట్రపతిని కలిసిన బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం :** మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుని బుధవారం వెంకటాచలం స్వర్ణ భారతి ట్రస్ట్ వద్ద వారి అతిధి గృహంలో బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు బొల్ల కాయల విజయభాస్కర్, బిజెపి మాజీ జిల్లా కార్యదర్శి చెంచు కృష్ణయ్య,బిజెపి మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొప్పాల సుబ్రహ్మణ్యం మరియు సదరన్ రైల్వే ప్యాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎంమస్తానయ్య,వైస్ ప్రెసిడెంట్ ఆర్ రాఘవన్ (రవి),సెక్రటరీ పేర్నాటి జోసెఫ్ (డి.ర్.యూ .సి .సి మెంబెర్),ఆర్గనైజర్ కంకిపాటి కిరణ్ కుమార్ లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట నుంచి నాయుడుపేట వరకు ఈఎంయు (లోకల్) ట్రైన్స్ ని పొడిగించమని బొల్ల కాయల విజయభాస్కర్ వెంకయ్య నాయుడు కి విజ్ఞప్తి చేయడం జరిగింది.దీనితో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సానుకూలంగా స్పందించి ఈ విషయమై ఆ శాఖ ఉన్నతాధికారులు, కేంద్ర రైల్వే శాఖ మంత్రితో మాట్లాడుతానని సానుకూలంగా స్పందించారు.

## అటకానితిప్ప-పెర్నాడు గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం :** సూళ్లూరుపేట నియోజకవర్గంలో రహదారి మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగాబుధవారం అటకానితిప్ప నుంచి పెర్నాడు వరకు 67 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అటకానితిప్ప-పెర్నాడు మార్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న రాకపోకల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం రూ 67 లక్షలతో గ్రావెల్ రోడ్డు పనులు చేపడుతున్నామని తెలిపారు.ఈ రహదారి పూర్తయితే స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు.అలాగే ఈ రహదారికి శాశ్వత పరిష్కారం కల్పిం చేందుకు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే తెలిపారు. ఆర్ అండ్ బి శాఖ నుంచి అటవీ శాఖకు డి జి పై ఎస్ సర్వే కోసం ఫైల్ పంపించడం జరిగిందని,సర్వే ప్రక్రియ పూర్తయిన అనంతరం పరివేష్ పోర్టల్ ద్వారా అవసరమైన అటవీ అనుమతుల కోసం నిరంతరం ఫాలోఅప్ చేసి, రహదారికి శాశ్వత పరిష్కారం తీసుకొస్తామని స్పష్టం చేశారు.ప్రస్తుతం ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.అదే సమయంలో అటవీ శాఖ అనుమతుల ప్రక్రియను పూర్తి చేసి, అటకానితిప్ప-పెర్నాడు రహదారికి పర్మినెంట్ సొల్యూషన్ తీసుకురావడమే మా లక్ష్యం" అని ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి కనెక్టివిటీని మెరుగుపరచడం,ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పూడికుప్పంలో మోడల్ అంగన్‌వాడీ భవనం ప్రారంభం



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం :** తడ మండలం పూడికుప్పం గ్రామంలో సెయింట్ గోబీఎన్ సంస్థ సి ఎస్ ఆర్ నిధులు రూ 34 లక్షలతో నిర్మించిన మోడల్ అంగన్‌వాడీ భవనాన్ని బుధవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే డా.నెలవల విజ యశ్రీ ప్రారంభించారు. చిన్నారులకు మెరుగైన వాతావరణంలో పూర్వ ప్రాథమిక విద్య, పోషకాహారం, సంరక్షణ సేవలు అందించేందుకు ఆధునిక సౌకర్యాలతో ఈ మోడల్ అంగన్‌వాడీ భవనాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే తెలిపారు.అలాగే సెయింట్ గోబియన్ సంస్థ సి ఎస్ ఆర్ కార్యక్రమంలో భాగంగా పూడికుప్పం గ్రామానికి 9 సోలార్ లెడ్ లైట్లను అందించింది.గ్రామంలో రాత్రివేళ వెలుతురు సౌకర్యాన్ని మెరుగుపరచడంలో ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు.నియోజకవర్గ అభివృద్ధిలో పరిశ్రమల సిఎస్ఆర్ భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు కృషి చేస్తున్నామని,విద్య,ఆరోగ్యం,తాగునీరు, పారిశుద్ధ్యం, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి సిఎస్ఆర్ నిధులను సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు పరిశ్రమల సి ఎస్ ఆర్ సహకారం తోడైతే గ్రామాల్లో మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించగలమన్నారు.పూడికుప్పం చిన్నారుల కోసం మోడల్ అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించడంతో పాటు సోలార్ లెడ్ లైట్లు అందించిన సెయింట్ గోబియన్ సంస్థకు ప్రత్యేక ధన్యవాదాలు" అని ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెయింట్ గోబైన్ సంస్థ ప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గ్రామాల సందర్శనతో ప్రజలకు చేరువగా తిరుపతి జిల్లా పోలీసులు

- రోడ్డు భద్రత,సైబర్ నేరాలు, పోక్సో చట్టం, మాదకద్రవ్యాలపై విస్తృత అవగాహన..
- జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా గ్రామాలను సందర్శించి అవగాహనా కార్యక్రమాలు.
- ప్రజలతో నేరుగా మమేకమై స్థానిక సమస్యలు, శాంతిభద్రతలపై ఆరా
- రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన.
- సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచనలు.
- పోక్సో చట్టం, బాలల భద్రతపై అవగాహన
- సున్నిత, అత్యంత సున్నిత గ్రామాల్లో ప్రత్యేక పర్యవేక్షణ
- రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామ పరిస్థితులపై ఆరా
- మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై క్రీడాకారులకు అవగాహన
- మాదకద్రవ్యాల సమాచారం కోసం 1972,112కు తెలియజేయాలని సూచన.



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు తమ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో నేరుగా మమేకమై వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిస్థితిని తెలుసుకోవడంతో పాటు ప్రజల స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. రైల్వే కోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని నారాయణరాజుపోడు ఏ.డబ్ల్యూ. గ్రామంలో ఎస్ఐ గ్రామస్తులతో సమావేశమై రోడ్డు ప్రమాదాల నివారణ,సైబర్ నేరాలు,పోకసో చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామ పరిస్థితులపై సమాచారం సేకరించి, గ్రామంలో రాత్రి బస చేశారు.బాలయపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మెల్చూరు గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించి మోటార్ వెహికల్ చట్టాలను ఉల్లంఘించే వారిపై విధించే జరిమానాలు,



సైబర్ నేరాల నివారణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.వెంకటగిరి మండలంలోని అత్యంత సున్నితమైన అమ్మపాలెం, సున్నితమైన కలపాడు గ్రామాలను వెంకటగిరి సీఐ సందర్శించి గ్రామస్తులతో నేరుగా మాట్లాడి గ్రామ పరిస్థితులను తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు, శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలపై ఆరా తీశారు.అదేవిధంగా తిరుపతిలో జరుగుతున్న స్టేట్ లెవల్ అమరావతి ఛాంపియన్‌షిప్--2026 క్రీడా పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు మాదకద్రవ్యాలు, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. యువత భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన, క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయం లేదా సరఫరాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 1972 లేదా 112 నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువ కావడం,గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలను పటిష్టంగా పర్యవేక్షించడం,ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడం లక్ష్యంగా గ్రామాల సందర్శనలు,రాత్రి బసలు,అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు తెలిపారు.

# కట్టుకున్న భార్యనే కడతేర్చిన కసాయి భర్త

**దొరవారిసత్రం -సూర్య వాస్తవం :** మనుషుల్లో మానవత్వం లోపిస్తోంది. పలు మత్తు పదార్థాల బానిసత్వంలో ఉన్మాదులుగా మారుతున్నారు. పగపట్టి ప్రతీకార చర్యల్లో పలు రకాల అనుమానాలతో అమ్మ,ఆలీ అనే తేడా లేకుండా ప్రాణాలు తీస్తున్నారు. ఇలాంటి సంఘటనే సూళ్లూరుపేట మండల పరిధిలోని కోటపోలూరు దళితవాడలో బుధవారం వెలుగులోకి వచ్చి ఆ గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేసింది.వివరాలు చూస్తే కోటపోలూరు గ్రామానికి చెందిన పనబాక శ్రీనివాసులుకు తడ మండలం, కారిజాత గ్రామంలోని సంధ్య అనే మహిళతో వివాహం అయింది. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. వీరి మధ్య కుటుంబ కలహాలు తలెత్తి సంధ్య పుట్టింటిలోని ఉండిపోయింది. కొన్ని రోజులకు స్థానిక పెద్దల సమక్షంలో పంచాయితీ చేసి ఇరువురిని కలపడంతో కొంతకాలం కారిజాతలోనే కాపురం చేసి, తిరిగి సూళ్లూరుపేటలో అద్దె గృహంలో చేరారు. సంధ్య కోటపోలురు నుండి అన్నం క్యారేజీ పట్టుకుని సూళ్లూరుపేట వెళుతున్నట్లు చెప్పి వెళ్ళింది. ఎక్కడ,ఏం జరిగిందో కానీ భర్త శ్రీనివాసులు భార్య సంధ్య



మృతదేహాన్ని చీరలో మూట కట్టుకుని బుధవారం గ్రామానికి వస్తుండగా గ్రామస్తులు ఈ సన్నివేశాన్ని గమనించారు. ఓవైపు చేతులు వేలాడుతూ,మరోవైపు వెంట్రుకల కనిపిస్తూ ద్విచక్ర వాహనంలో తీసుకు వెళుతున్న శవాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. భార్యాభర్తల మధ్య ఉన్న కుటుంబ కలహాలతో ఉన్మాదిగా మారిన బర్తే చంపి శవాన్ని ఇంటికి చేర్చి నేనే చంపాను అంటూ అక్కడ ఉన్నవారికి తెలిపారు. మృతురాలిని ఒక్కడే చంపాడా! వేరొకరు సహాయం తీసుకున్నాడా అనే విషయాలు పోలీసుల విచారణలో వెల్లడి కానుంది. కోటపోలూరు గ్రామ సమీపంలో ఉన్న పుచ్చ కాలవ పొలాల వద్ద సంధ్య శరీరంపై ఉన్న కొన్ని వస్తువులను ఆ ప్రాంతంలో గుర్తించినట్లు స్థానికులు చెబుతున్నారు.ఈ సంఘటన తెలుసుకున్న మృతి చెందిన సంధ్య బంధువులు ఆ గ్రామానికి చేరుకున్నారు.విషయం తెలుసుకున్న సిఐ మురళీకృష్ణ,ఎస్ ఐ అజయ్ కుమార్ ఆ గ్రామానికి చేరుకుని కేసు నమోదు చేశారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట సిహెచ్ సికి తరలించారు. ఈ హత్యాసంఘటన ఓ మిస్టరీగా ఉంది. ఇది ఎలా జరిగింది, ఎక్కడ జరిగింది, ఎప్పుడు జరిగింది, ఎవరెవరు సూత్రధారులు అనేది రాబట్టేందుకు పోలీసులు ముద్దాయిని విచారణ చేస్తున్నట్లు సమాచారం.



# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు

- తిరుపతి జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా వాహన తనిఖీలు
- జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు విస్తృతంగా వాహన తనిఖీలు.
- ప్రధాన రహదారులు, ముఖ్య కూడళ్లలో ప్రత్యేక తనిఖీలు.
- డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక నిఘా.
- రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా నిరంతర తనిఖీలు.





**దొరవారిసత్రం -సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, ఐపీఎస్.ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహిస్తూ పటిష్టమైన చర్యలు చేపట్టారు.రోడ్డు ప్రమాదాల నివారణ,ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రధాన రహదారులు,ముఖ్య కూడళ్లు,రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా వాహనాల ధ్రువపత్రాలు,డ్రైవింగ్ లైసెన్స్,హెల్మెట్,సీట్ బెల్ట్ తదితర ట్రాఫిక్ నిబంధనలను పరిశీలించారు.నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టారు.అదేవిధంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి సారించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు చేపడుతున్నారు.మద్యం సేవించి వాహనం నడపడం వల్ల రోడ్డు ప్రమాదాల ప్రమాదం పెరుగుతుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పోలీసులు సూచించారు.జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసు అధికారులు తెలిపారు.వాహనదారులు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి,హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగిస్తూ సురక్షిత ప్రయాణానికి సహక రించాలని కోరారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, మాట్లాడుతూ ప్రజల ప్రాణ భద్రతకు భంగం కలిగించే విధంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం,మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, వాహనదారులు స్వీయ నియంత్రణతో నిబంధనలు పాటించాలని సూచించారు.



# పుట్టినరోజున టైటిల్ గ్లింప్స్



కింగ్ నాగార్జున ప్రస్తుతం తన కెరీర్‌లో ప్రతిష్ఠాత్మకమైన 100వ చిత్రంలో నటిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌లో రూపొందిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం 'కింగ్100' అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రచారంలో ఉంది. ప్రముఖ తమిళ దర్శకుడు రా కార్తీక్ ఈ సినిమాతో తెలుగులో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.

ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకొంటున్న ఈ సినిమా నుంచి తాజాగా అప్‌డేట్ పంచుకుంది చిత్రబృందం. ఆగస్టు 29న నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఈ మూవీ టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేయనున్నారు. 'నిన్నే పెళ్లాడతా', 'ఆవిడ మా ఆవిడే' వంటి చిత్రాల్లో నాగార్జునతో కలిసి నటించిన సీనియర్ హీరోయిన్ టబు.. చాలా కాలం తర్వాత మరోసారి ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవడం సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.



# నాకు ఈపాటికి పాపనో బాబో ఉండేవారు!

టాలీవుడ్ యంగ్ బ్యూటీ ప్రియా భవానీ శంకర్ ఇటీవల 'ఇరుముడి' చిత్రంతో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సినిమాలో మాస్ మహారాజా రవితేజ సరసన భార్యగా, ఒక పాపకు తల్లిగా కనిపించి తన నటనతో ప్రశంసలు అందుకుంది. ఈ రోజుల్లో చాలామంది హీరోయిన్లు చిన్న వయసులోనే తల్లి పాత్రల్లో నటించేందుకు ఇష్టపడకపోవడం కామన్. అయితే ప్రియా భవానీ శంకర్ మాత్రం పాత్ర స్వభావాన్ని, కథలోని ప్రాధాన్యతను బట్టి ముందడుగు వేయడం అందరినీ ఫిదా అయ్యేలా చేసింది. అయితే, ఈ సినిమా మంచి విజయం సాధించిన సందర్భంగా, ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన పాత్ర, కెరీర్ నిర్ణయాలపై ఆమె పలు ఆసక్తికర విషయాలు పంచుకుంది ప్రియా భవానీ శంకర్. "దర్శకుడు మొదటిసారి 'ఇరుముడి' కథను వివరించినప్పుడు, అది ఎంతో భావోద్వేగంగా, మనసును హత్తుకునేలా అనిపించింది. కాగితంపై చదివిన ఆ ఎమోషన్ అదే రీతిలో వెండితెరపైకి వస్తుందా.. లేదా? అన్న ఒకే ఒక్క సందేహం నాలో ఉండేది. కానీ చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయం సాధించి ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవ్వడంతో ఆందోళన తొలగిపోయింది. తెరపై ఒక బిడ్డకు తల్లిగా నటించడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. ఒకవేళ తనకు ఇరవై ఏళ్ల వయసులోనే వివాహం జరిగి ఉంటే, ఈపాటికి నిజ జీవితంలోనూ ఒక పాప లేదా బాబు ఉండేవారు. అందువల్ల ఇలాంటి పాత్రలు చేయడానికి వెనుకాడాల్సిన అవసరం లేదు. ఒక నటిగా తనకు పాత్ర కంటే కూడా ఆ కథ ఎంత బలంగా ఉందో చూసుకోవడమే ముఖ్యం. కాబట్టి కథ నచ్చితే ఏం చేయడానికైనా సిద్ధంగా ఉంటాను" అని తెలిపింది.

# తన బలహీనతనే బలంగా మార్చుకునే గాంధారి

హీరోయిన్ తాప్సీ పన్నునటించిన తాజాచిత్రం 'గాంధారి'. దేవాశిష్ మఖిజా దర్శకత్వంలో కనికా థిల్లాన్ రచన, నిర్మాణంలో రూపొందిన హై-వోల్టేజ్ యాక్షన్ క్రైమ్-థ్రిల్లర్ చిత్రమిది. కథా పిక్చర్స్ బ్యానర్ సమర్పణలో రూపొందుతున్న ఈ సినిమాలో తాప్సీ పన్నుతోపాటు ఇష్వాక్ సింగ్, స్వస్తిక ముఖర్జీ, ఛాయా కదం, జతిన్ సర్నా, మీతా వశిష్ట్ కీలక పాత్రలు పోషించారు.

ఒక తల్లి, అదృశ్యమైన ఆమె కుమార్తె చుట్టూ తిరిగే కథతో రూపుదిద్దుకున్న ఈ మూవీ ట్రైలర్ విడుదలైంది. ట్రైలర్ తాప్సీ పోషించిన దృష్టి లోపం ఉన్న పాత్రతో మొదలైందీ ట్రైలర్. తన చిన్న కూతురు రైలులో అపహరణకు గురి కావడం.. తన శారీరక పరిమితులు, ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ, ఆ తల్లి తన బిడ్డను చేరుకోవడానికి ప్రయత్నిస్తూ, తన బలహీనతను బలంగా మార్చుకోవడం వంటి అంశాలతో ఆసక్తికరంగా ఉందీ ట్రైలర్. తల్లి-కూతుళ్ల అనుబంధాన్ని, ఒక తల్లి పడే సంఘర్షణను ఈ సినిమా భావోద్వేగభరితంగా ఆవిష్కరించనుందని ట్రైలర్ చూసే తెలుస్తోంది. ఇందులో తన కూతురిని తిరిగి పొందేందుకు ఎంతటి సాహసానికైనా సిద్ధపడే దృఢమైన, ధైర్యవంతురాలైన మహిళలో తాప్సీ అలరించనుంది. ఈ చిత్రం సెప్టెంబర్ 3వ తేదీ నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది.





# గెలుపు ముంగిట భారత్

శ్రీలంకతో రెండో టెస్టో టీమిండియా గెలుపు ముంగిట నిలిచింది. 213 పరుగుల భారీ లోటుతో ఫాలో ఆన్ ఆడిన శ్రీలంక నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్లో 72.4 ఓవర్లలో 6 వికెట్లకు 229 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్లో సెంచరీతో ఆకట్టుకున్న సోనాల్ దినుషాను ఔట్ చేస్తే భారత విజయం లాంఛనం కానుంది. అయితే వర్షం ముప్పు పొంచి ఉండటం టీమిండియాను ఆందోళనకు గురిచేస్తోంది. కొలంబో, ఆగస్టు 26: 265/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 89.4 ఓవర్లలో 290 పరుగులకు కుప్పకూలింది.



ఓవర్‌నైట్ బ్యాటర్ సోనాల్ దినుషా(162 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌తో 103) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శ్రీలంక చివరి రెండు వికెట్లను అరంగేట్ర స్పిన్నర్ సారాన్ష్ జైన్ దక్కించుకున్నాడు. ప్రసిధ్ కృష్ణ, మానవ్ సుతార్ మూడేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తలో వికెట్ పడగొట్టారు. ఓవర్‌నైట్ స్కోర్క్ శ్రీలంక 25 పరుగులు మాత్రమే జోడించింది. విజయంపై ఫోకస్ పెట్టిన భారత్(ꉂముఎ ×అఞఖు) వ్యూహాత్మకంగా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించకుండా శ్రీలంకను ఫాలో ఆన్ ఆడించింది. రెండో ఇన్నింగ్స్ ఆరంభంలోనే శ్రీలంకకు సిరాజ్ గట్టి షాకిచ్చాడు. లాహిరు ఉడానా(3)ను క్యాచ్ ఔట్గా పెవిలియన్ చేర్చాడు. పసిందు సూర్యబండార, కామిల్ మిశ్రా ఆచితూచి ఆడారు. 58 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో సెట్ అయిన ఈ జోడీని జడేజా విడదీసాడు. కామిల్ మిశ్రా(32)ఎల్బీగా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి కామిందు మెండిస్ రాగా.. శ్రీలంక 83/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్కు వెళ్లింది. సెకండ్ సెషన్లో శ్రీలంక ఆధిపత్యం చెలాయించింది. సూర్య బండార, కామిందు మెండీస్ ఆచితూచి ఆడారు. ఈ ఇద్దరూ సాధికారికంగా బ్యాటింగ్ చేస్తూ..భారత బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచారు. పసిందు సూర్యబండార 78 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించగా.. కామిందు మెండీ స్ 87 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. 115 పరుగుల భారీ భాగస్వామ్యంతో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని ప్రసిధ్ కృష్ణ విడదీసాడు. శుభ్మన్ గిల్ స్టన్నింగ్ క్యాచ్తో కామిందు మెండీస్ను పెవిలియన్ చేర్చాడు. ఈ వికెట్తో ప్రసిధ్ కృష్ణ మ్యాచ్ను భారత్వైపు తిప్పాడు.

మూడో సెషన్లో భారత బౌలర్లు నిప్పులు చెరిగారు. ఆచితూచి ఆడిన ధనంజయ డిసిల్వా(23)తో పాటు సెంచరీ దిశగా సాగిన పసిందు సూర్యబండార(173 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్తో 92)ను మానవ్ సుతార్ వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే నిరోషన్ డిక్వెల్లాను సరాన్ష్ జైన్ వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. సోనాల్ దినుషా, కేశర నువాంత మరో వికెట్ పడకుం డా నాలుగో రోజు ఆటను ముగించారు. ప్రస్తుతం శ్రీలంక 16 పరుగుల ఆధిక్యం లో ఉంది. గురువారం శ్రీలంకను వీలైనంత త్వరగా ఆలౌట్ చేస్తే భారత్ విజ యం సులువు అవుతుంది.

**స్కోరు బోర్డు**

భారత్ తొలి ఇన్నింగ్స్: 503/9 డిక్లేర్డ్ ( పడిక్కల్ 117, జురెల్ 115 , పంత్ 63 , గిల్ 50 , జడేజా 43 ; అసితా ఫెర్నాండో 4/106)

శ్రీలంక తొలి ఇన్నింగ్స్ : 290 ( సోనాల్ దినుషా85 బ్యాటింగ్, సూర్యబండార 80 ;ప్రసిద్ధ కృష్ణ 3/47 మానవ్ సుతార్ 3/87 )

శ్రీలంక రెండో ఇన్నింగ్స్: 229/6 ( పసిందు సూర్యబండార 92 , కేశర నువాంత 3 బ్యా టింగ్,ంగ్ ; మానవ్ సుతార్ 2/81 )



# హద్దుమీరుతున్నారు

## - వైభవ్, జైస్వాల్ తీరుపై మంజ్రేకర్ విమర్శలు

**కొలంబో,** భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ, ఓపెనర్ యశస్వి జైస్వాల్ ప్రవర్తనపై మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. మైదానంలో ప్రత్యర్థి ఆటగాళ్లతో అనుచితంగా ప్రవర్తించే యువ ఆటగాళ్లను వదిలిపెట్టకూడదని.. ఐసీసీ, బీసీసీఐ కఠిన చర్యలు తీసుకోవాలని సూచించాడు. ఇలాంటి ప్రవర్తనను పట్టించుకోకుండా వదిలేస్తే.. భవిష్యత్తులోనూ అదే తప్పును పునరావృతం చేసే ప్రమాదం ఉందని హెచ్చరించాడు. భారత్- ఏ తరఫున ఆడేటప్పుడు వైభవ్ సూర్యవంశీ, ఇటీవల యశస్వి జైస్వా ల్ శ్రీలంక ఆటగాళ్లతో వాగ్వాదానికి దిగారు. ఇలాంటి ప్రవర్తన ఏ.మాత్రం సరికాదని మంజ్రేకర్ వ్యాఖ్యానించారు. కాగా గత జూన్లో శ్రీలంక-ఏతో భారత్-ఏ జట్లు ట్రై సిరీస్ ఆడింది. వైభవ్ సూర్యవంశీ ఔటైన తర్వాత.. డకౌట్కు వెళ్తుంటే శ్రీలంక ప్లేయర్ విషేన్ హలమ్ ఏవో వ్యాఖ్యలు చేశాడు. దీంతో ఆగ్రహానికి గురైన వైభవ్.. వెనక్కి వచ్చి ధీటుగా బదులిచ్చాడు. అయితే వైభవ్‌తో పాటు లంక ప్లేయర్‌పై ఐసీసీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. శ్రీలంకతో కొలంబోలో జరిగిన రెండో టెస్టులో, లంక బౌలర్ అసిత ఫెర్నాండో ఔట్ చేసిన తర్వాత జైస్వాల్ను దూషించడంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. దీనికి ఐసీసీ ఇద్దరి మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధిస్తూ, ఒక డీమెరిట్ పాయింట్ ఇచ్చింది.

# కడపలో మిలాద్ - ఉన్ - నబీ భారీ ర్యాలీ

**కడప- సూర్య వాస్తవం:** వైయస్సార్ కడప జిల్లా కేంద్రమైన కడప నగరంలో బుధవారం మిలాద్ ఉన్ నబీ మహా ప్రవక్త హజరత్ ముహమ్మద్ ముస్తఫా సోల్లల్లాహు అలైహి వసల్లం వారి జన్మదిన పర్వదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మర్కజి జులూస్ కమిటీ, కడప ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పీఠాధిపతి మహమ్మద్ అలీ బాగ్దాది నాయకత్వంలో ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో భారీ సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీ స్థానిక అల్మాస్పేట నుంచి అగాడి మీదుగా బయలుదేరి చిలకల బావి పరిసర ప్రాంతం, బహదూర్ ఖాన్ మసీదు వీధి, చెన్నూరు బస్టాండ్, ఏడు రోడ్ల సర్కిల్, మద్రాస్ రోడ్డు, క్రిస్టియన్ లేన్ మీదుగా గుంత బజారులోని స్థానిక మసీదు వద్దకు చేరుకుంది . ర్యాలీ మధ్యలో మహా మహోపకారి మహా ప్రవక్త గురించి ముస్లింలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి పఠాన్ మహా మ్మద్ అలీ ఖాన్ మాట్లాడుతూ అల్లా కృపతో మానవ మహోపకారిగా హజ్రత్ మొహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారు భూమి పై జన్మించారన్నారు. ప్రవక్త శ్వాస, ధ్యాస కేవలం అల్లాహ్ ఆరాధన ప్రతిరోజు ఆ ఐదు పూటలా నమాజు, పరోపకారం, త్యాగం, మానవ సేవలోనే గడిచిందన్నారు.




ప్రపంచానికి ఖురాన్ వంటి గ్రంథాన్ని అల్లా ప్రవక్త ద్వారా అందించారన్నారు. అందువల్ల ప్రవక్త సూచించిన సన్మార్గంలో మానవాళి తమ జీవితాన్ని సాఫల్యం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం నిర్వాహకులు స్థానిక గుంత బజారు మసీదులో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా చాలామంది మత గురువులు, మైనార్టీ నేతలు మహా ప్రవక్త జీవిత విశేషాలు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మయానరహంతుల్లా ఖాన్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ ప్రతినిధి రఫీ ఖాన్ , వివిధ పార్టీల మైనార్టీ నాయకులు మత గురువులు పీఠాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

# పండుగను ప్రశాంతంగా జరిపుకుందాం

## - ఎస్ఐ వినోద్ కుమార్



**చిట్వేల్-సూర్య వాస్తవం:** చిట్వేలు మండలం వినాయకచవితి పండుగను ప్రశాంతంగా జరుపు కొనేందుకు అందరూ సహకరించాలని ఎస్ఐ వినోద్ కుమార్ ఉత్సవ కమిటీల సభ్యులకు పిలుపునిచ్చారు. ఉన్నతాధి కారుల ఆదేశాలమేరకు స్థానిక పోలీసు స్టేషన్ ప్రాంగణంలో బుధవారం సాయంత్రం వినాయకచవితి ఉత్సవకమిటీ సభ్యులకు సమావేశం నిర్వహించారు. ఈసందర్బంగా ఎస్ ఐ మాట్లాడుతూ వినాయకచవితి ఉత్సవాలనుపురస్కరించుకొని విగ్రహాలఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనుసరి అన్నారు. ఎవ్వరికి ఎలాంటి ఇబ్బందికలగకుండా ఉండే ప్రాంతంలో విగ్రహలు ఏర్పాటుచేయాలి. రాత్రి 10గంటలనుండి ఉదయం 6గంటలవరకు సాంస్కృతిక కార్యక్రమాలు, డిజేలు నిర్వహించరాదు. నిమజ్జన కార్యక్రమాన్ని మూడు రోజులలోపు ముగించాలి. సాయంత్రం 6గంటలలోపే కార్యక్రమాన్ని ముగించాలి. నిమజ్జనంలో మద్యం సేవించిరాదు. బాణాసంచా వినియోగంలో నిబంధనలను పాటించాలి. రాజకీయ పార్టీల పాటలు, ఫొటోలు, జండాలు, నినాదాలు, పోస్టర్లు, బ్యానర్లుఏర్పాటు చేయరాదు. బలంతంగా విరాళాలు వసూలు చేయరాదు. నిమజ్జనంలో ఉపయోగించే వాహనాలను ముందుగా ఏర్పాటు చేసుకొని పోలీసులు అనుమతించిన మార్గం, తేదీ, సమయం మాత్రమే పాటించాలి. ఉత్సవాలసమయంలో శాంతి బద్రతలకు, ఇరుగు పొరుగు వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాల్సినబాధ్యత కమిటీలదే అంటూ ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్ఐ వినోద్ కుమార్ హేచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, కమిటీల సభ్యులు పాల్గొన్నారు.



# షేక్ షబ్బీర్ ఆధ్వర్యంలో అన్నదానం

## - రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో పేదలకు బిర్యానీ, స్వీట్లు, మంచినీటి బాటిళ్ల పంపిణీ

**నాయుడుపేట - సూర్య వాస్తవం:** నాయుడుపేట పట్టణంలో మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షులు, కౌన్సిలర్ షేక్ షబ్బీర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం పట్టణంలోని రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లోని నిరుపేదలు, యాచకులు, అవసరంలో ఉన్న వారికి బిర్యానీ ప్యాకెట్లతో పాటు స్వీట్లు, మంచినీటి బాటిళ్లను పంపిణీ చేశారు. మిలాద్ ఉన్ నబీ పర్వదినం సందర్భంగా ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా షేక్ షబ్బీర్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. సమాజంలో ఆపదలో ఉన్న వారికి, నిరుపేదలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. మత సామరస్యం, సోదరభావం, ప్రేమ, శాంతి వంటి సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే మిలాద్ ఉన్ నబీ పర్వదినం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పరస్పరం ప్రేమాభిమానాలతో, సోదరభావంతో మెలగాలని, పేదలు మరియు అవసరంలో ఉన్నవారికి తమవంతు సహాయ సహకారాలు అందించాలని షబ్బీర్ కోరారు. మిలాద్ ఉన్ నబీ పర్వదినం సందర్భంగా నాయుడుపేట ప్రజలతో పాటు ముస్లిం సోదరులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని నిరుపేదలకు ఆహార పదార్థాలు, మంచినీరు పంపిణీ చేశారు.



## హజరత్ జమాలుల్లా భాషా ఉరుసులో 1000 మంది భక్తులకు ఉచిత కూల్ డ్రింక్స్ పంపిణీ





**రాయచోటి -సూర్య వాస్తవం:** రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని పాత రాయచోటిలో వెలిసియున్న అతి పురాతనమైన హజరత్ జమాలుల్లా బాబా ఉరుసు ఉత్సవాలు జరుగుతున్న సందర్భంగా బుధవారం రాయచోటి జనసేన పార్టీ నాయకుడు ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో హజరత్ జమాలుల్లా బాషా దర్గాలో భక్తులకు సుమారు 1000 మందికి ఉచితంగా కూల్ డ్రింక్స్, (చల్లని పానీయాలు)వాటర్ బాటిల్స్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకుడు ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్ మాట్లాడుతూ భక్తుల రద్దీ దృష్ట్యా ఎండ తీవ్రతను తట్టుకోవడానికి ఉచిత చల్లటి పానీయాలు (కూల్ డ్రింక్స్), తాగునీరు పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సందర్భంగా తమ పార్టీ నాయకుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ఆయురారోగ్యాలతో జీవించాలని, జనసేన పార్టీ తరఫున రాష్ట్ర ప్రజలకు సేవలు అందించాలని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు దర్బార్ భాష, అత్తార్ యహియా, అష్రఫ్ అలీ, హబీబ్, సుహేల్, జిలాన్ భాష, తదితరులు పాల్గొన్నారు.

## తపోవన ఆశ్రమానికి నిత్యవసర సరుకులు అందజేత



**చిట్వేల్-సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా చిట్వేల్ మండలం తిమ్మాయపాలెం క్రాస్ రోడ్డు వద్ద వెలసినటువంటి శ్రీ నారాయణమ్మ స్థాపించిన శ్రీశ్రీశ్రీ దత్తగిరి నారాయణ తపోవన అభయాంజనేయ స్వామి ఆశ్రమంకి ధర్మనిధి చారిటబుల్ ట్రస్టు సభ్యులైనటువంటి శ్రీ భీము వెంకట సుబ్బారెడ్డి ధర్మపత్ని కుసుమకుమారి వారిపెళ్లిరోజు సందర్భంగా ఆశ్రమంకి బియ్యము కూరగాయలు పప్పు దినుసులు పండ్లు ఆలయం పీఠాధిపతి నాగేశ్వరమ్మ ట్రస్ట్ సభ్యులు చంద్రశేఖర్‌కు అందజేశారు.

ఇందులో నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, పురం రామ్మోహన్, గోపాల్ వలసాని స్వయంగా ఆశ్రమంకి వచ్చి అందజేశారు. తమకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని వారు తెలిపారు. ఆలయ పిఠాధిపతులు నాగేశ్వరమ్మ మాట్లాడుతూ ఆశ్రమంకి అందించిన దాతలకి వారికి అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా తెలుపుతూ ప్రతి కుటుంబంలోని సభ్యులు ఎటువంటి పుట్టినరోజులు పెళ్లి రోజులు వారింట్లో జరిగే ఎటువంటి కార్యక్రమాలు అయినా ఆశ్రమంలో జరుపుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ఘనంగా మదర్ థెరిసా జయంతి వేడుకలు



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం:** మదర్ థెరిసా జయంతి వేడుకలను బుధవారం అత్యంత అత్యంత ఘనంగా నిర్వహించారు. (రాస్,) రూరల్ అవేర్నెస్ సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ వలి భాష మరియు వారి సిబ్బంది కలిసి వీరబల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన మదర్ తెరిసా విగ్రహానికి పూలమాలవేసి అదేవిధంగా పక్కనే ఉన్న మహాత్ముల విగ్రహాలకు కూడా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా అక్కడికి విచ్చేసిన యువతకు స్వీట్ అందజేశారు. ఈ సందర్భంగా రాస్ అధ్యక్షులు వలి భాష మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తన సంపాదనలో ఎంతో కొంత పేదవారికి దానం చేయడమే కాకుండా సమాజ సేవ కార్యక్రమాల్లో పాల్గొని ప్రజాసేవ చేసినట్లయితే వారికి కూడా దైవ సహాయం ఎన్నడూ ఉంటుందని ఆయన అన్నాడు. ఆయనతోపాటు యువత తదితరులు పాల్గొన్నారు

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : 41/1320, Sankarapuram, Kadapa, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, CELL : : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
గురువారం
27 ఆగస్టు 2026


# ఘనంగా పామిడిలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు



**పామిడి – సూర్య వాస్తవం :** స్థానిక పామిడి పట్టణంలోని ముస్లిం సోదరులందరూ మహమ్మద్ ప్రవక్త జన్మదిన (మిలాద్ ఉన్ నబీ) పర్వదినంను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మత గురువు మౌలానా అల్హాజ్ పల్జాద్ రహమన్ సాహెబ్, మాట్లాడుతూ ఈపవిత్ర పర్వదినం సర్వమత సామరస్యాన్ని,సోదరభావాన్ని, పెంపొందించాలని ఆశిస్తూ ప్రతి ఒక్కరి ఇంట్లో సిరులు ఆయురారోగ్యాలతో అల్లాహ్ అనంతకృప కరుణకటాక్షాలు ప్రతి ఒక్కరికి కలగాలని కోరుకున్నారు. ప్రార్థనలు, ఆధ్యాత్మిక సేవాకార్యక్రమాలు నిర్వహించడం గూర్చి తెలుపుతూ ఉన్నవారికి అండగా నిలవడం,పేదలకుఆహారం అందించడం, ఇతరులకు సహాయం చేయడం, సహచరుల కష్టసుఖాలను పాలుపంచుకోవాలన్నారు. మానవత్వంతో దయ దానం సహాయం తోడ్పాటు పరస్పర గౌరవం వంటి విలువలను ఆచరించడమే ఈ పవిత్ర పర్వదినం యొక్క సందేశం అన్నారు. ముస్లింల ఆరాధ్య దైవం మహమ్మద్ ప్రవక్త జన్మదినం కావడంతో గృహాలను మసీదులను ప్రత్యేకంగా అలంకరించు కొని, పామిడి పురవీధులలో పెద్దఎత్తున బైక్ ర్యాలీ,ఆయా మసీదుల నుంచి ర్యాలీ నిర్వహిస్తూ ముస్లిం సోదరులు ఒకరికొకరు అలింగణం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు కే రహీం, బి. రుక్మాణ్, ఆసిఫ్, బికె. రహీం, ఆర్మీ రఫీ, రజాక్, ఇమామ్ నిజాం, అబ్దుల్ ఖాదర్,తుల్లా,షేక్షా,వళి, ఇమాంలు తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు వైభవంగా బారీగా నిర్వహించారు. అన్ని మసీదులలో అన్నదాన కార్యక్రమాలు జరిపారు.

# మిలాద్ ఉన్ నబీ సందర్భంగా అనంతపురంలో భారీ ర్యాలీ...!

**- ర్యాలీలో పాల్గొన్న మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, ముస్లిం సోదరులు**

**- రాష్ట్ర ప్రజలకు ఈద్ మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపిన షకీల్ షఫీ**



**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం :** అనంతపురం నగరంలో మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని మిలాద్ ఉన్ నబీ పవిత్ర పండుగ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో రాష్ట్ర ముతవల్లిల సంఘం అధ్యక్షులు అల్హాజ్ కె.ఎం. షకీల్ షఫీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిలాద్ ఉన్ నబీ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషం, శాంతి, సౌభ్రాతృత్వాన్ని నింపాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలతో పాటు హిందూ––ముస్లిం సోదర సోదరీమణులందరికీ ఈద్ మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర డీఎస్పీ ఎం. చంద్రశేఖర్, ఖాజీ అబ్దుల్ మజీద్, మాజీ గ్రంథాలయ చైర్మన్ గౌస్ మొహిద్దిన్, నగర మాజీ మేయర్ వసీం, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దాదా గాంధీ, మాజీ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ రిజ్వాన్, ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ మహబూబ్ బాషా, మాజీ కార్పొరేటర్లు సైఫుల్లా బేగ్, మదని ఇసాక్, ఆవాజ్ కమిటీ అధ్యక్షులు వలి, కాంగ్రెస్ నాయకులు ఎం.ఎం.డి.ఎ. ఇమామ్, శర్మస్ వలి, మానవ హక్కుల నాయకులు జాకీర్, ఐ.ఎం.ఎం. బాషా, కె. బాబాజీ, డాన్ సాదిక్, షేక్ నూర్ బాబా, షేక్ షాకీర్‌తో పాటు పలువురు ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మిలాద్ ఉన్ నబీ మహబూబ్ సుబహాని జెండా కట్ట వద్ద ప్రత్యేక ప్రార్థనలు...!

**- సర్వరి జిలాన్, అంజద్ ఖాన్ మిత్రబృందం ఆధ్వర్యంలో అన్న వితరణ**

**- మిలాద్ ఉన్ నబీ సందర్భంగా 600 మందికి అన్నదానం**

**- అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, షకీల్ షఫీ**

**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం :** అనంతపురం నగరంలోని అశోక్ నగర్‌లో మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని పవిత్ర మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా మహబూబ్ సుబహాని జెండా కట్ట వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే , అనంతపురం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, రాష్ట్ర ముతవల్లిల సంఘం అధ్యక్షులు అల్హాజ్ కె.ఎం. షకీల్ షఫీ ముస్లిం సోదరులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం సర్వరి జిలాన్, అంజద్ ఖాన్, వారి మిత్రబృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో అనంత వెంకటరామిరెడ్డి, అల్హాజ్ కె.ఎం. షకీల్ షఫీ పాల్గొని సుమారు 600 మందికి అన్న వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో దిల్దార్ హుస్సేన్, జాకీర్, జహీర్, అనిల్, బాబ్జీ, మూర్తుజా, ఆర్టీవో జిలాన్, ఖాదర్, నిజాం తదితరులు పాల్గొన్నారు.



# అనంతపురంలో ఘనంగా ఈద్ మిలాద్ ఉన్ నబీ ర్యాలీ...!

- పెద్ద సంఖ్యలో పాల్గొన్న మత పెద్దలు, యువత, ముస్లిం సోదరులు
- ఇస్లామిక్ జెండాలతో నగర ప్రధాన వీధుల్లో ర్యాలీ
- ప్రవక్త మహమ్మద్ బోధనలు ప్రజలకు వివరించిన మత పెద్దలు
- ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మౌలానా నవాజ్ బియాబానీ చిష్తిఉల్ ఖాద్రి
- ప్రజలందరికీ మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపిన నవాజ్ బియాబానీ చిష్తిఉల్ ఖాద్రి



**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం :** అనంతపురంనగరంలో మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని ఈద్ మిలాద్ ఉన్ నబీ సందర్భంగా అనంతపురం నగరంలో ముస్లిం సోదరులు ఘనంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మత పెద్దలు, యువత, ముస్లిం సోదరులు పాల్గొని పండుగ శోభను చాటారు.ఇస్లామిక్ జెండాలు చేతబట్టి నగరంలోని ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా మత పెద్దలు ప్రవక్త మహమ్మద్ బోధించిన శాంతి, సోదరభావం, మానవత్వం, సామరస్య విలువలను ప్రజలకు వివరించారు.ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మౌలానా నవాజ్ బియాబానీ చిష్తిఉల్ ఖాద్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈద్ మిలాద్ ఉన్ నబీ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషం, శాంతి, సౌభ్రాతృత్వాన్ని నింపాలని ఆకాంక్షించారు. అనంతపురం నగర ప్రజలతో పాటు ముస్లిం సోదర సోదరీమణులందరికీ ఈద్ మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు.సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం, సోదరభావం మరింత బలపడాలని ఆయన కోరుకున్నారు. ర్యాలీ సందర్భంగా నగరంలో పండుగ వాతావరణం నెలకొంది. శాంతియుతంగా ర్యాలీ నిర్వహించేందుకు సంబంధిత అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. నిర్వాహకులు ప్రజలకు ఈద్ మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు.

# ఇస్లామిక్ జెండాలతో నగర ప్రధాన వీధుల్లో ర్యాలీ

- పెద్ద సంఖ్యలో పాల్గొన్న మత పెద్దలు, యువత, ముస్లిం సోదరులు - ప్రవక్త మహమ్మద్ బోధనలు ప్రజలకు వివరించిన మత పెద్దలు
- ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మౌలానా నవాజ్ సాహెబ్ - ప్రజలందరికీ మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపిన నవాజ్ సాహెబ్






**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం :** అనంతపురం నగరంలో మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని ఈద్ మిలాద్ ఉన్ నబీ సందర్భంగా అనంతపురం నగరంలో ముస్లిం సోదరులు ఘనంగా ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మత పెద్దలు, యువత, ముస్లిం సోదరులు పాల్గొని పండుగ శోభను చాటారు.ఇస్లామిక్ జెండాలు చేతబట్టి నగరంలోని ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా మత పెద్దలు ప్రవక్త మహమ్మద్ బోధించిన శాంతి, సోదరభావం, మానవత్వం, సామరస్య విలువలను ప్రజలకు వివరించారు.ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మౌలానా నవాజ్ సాహెబ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈద్ మిలాద్ ఉన్ నబీ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషం, శాంతి, సౌభ్రాతృత్వాన్ని నింపాలని ఆకాంక్షించారు. అనంతపురం నగర ప్రజలతో పాటు ముస్లిం సోదర సోదరీమణులందరికీ ఈద్ మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు.సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం, సోదరభావం మరింత బలపడాలని ఆయన కోరుకున్నారు. ర్యాలీ సందర్భంగా నగరంలో పండుగ వాతావరణం నెలకొంది. శాంతియుతంగా ర్యాలీ నిర్వహించేందుకు సంబంధిత అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. నిర్వాహకులు ప్రజలకు ఈద్ మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు.

# మానవాళి కోసం కృషి చేసిన కారణజన్ముడు... మహమ్మద్ ప్రవక్త...!

**- మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**

**- నగరంలోని పలు దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు - ప్రవక్త బోధనలను పాటించాలని పిలుపు**



**అనంతపురం ప్రతినిధి – సూర్య వాస్తవం:** అనంతపురం నగరంలోని ముస్లిం సోదరులకు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు. మానవాళి శ్రేయస్సు కోసం కృషి చేసిన కారణజన్ముడు మహమ్మద్ ప్రవక్త అని ఆయన పేర్కొన్నారు.మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నగరంలోని పలు దర్గాలను సందర్శించారు. ముందుగా పాతూరులోని బంగారువీధిలో ఉన్న శ్రీ సయ్యదా మాసుమా బీబీ సాహెబా, సారాన్ బీబీ సాహెబా దర్గాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆసార్ దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు.మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని మిలాద్ ఉన్ నబీగా జరుపుకుంటారని, ప్రవక్త బోధించిన శాంతి, సోదరభావం, మానవత్వం, పరస్పర సహకారం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఎమ్మెల్యే సూచించారు. శాంతియుత సమాజ నిర్మాణం కోసం మహమ్మద్ ప్రవక్త కృషి చేశారని, ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుస్తూ శాంతి, సోదరభావంతో జీవించాలని పిలుపునిచ్చారు.

# మిలాద్ ఉన్ నబీ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన వై విశ్వేశ్వర్ రెడ్డి...!

**- శాంతి, సోదరభావం, మానవత్వం విలువలను చాటే పర్వదినంగా మిలాద్ ఉన్ నబీ**

**ఉరవకొండ టౌన్ – సూర్య వాస్తవం :** మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని జరుపుకుంటున్న పవిత్ర మిలాద్ ఉన్ నబీ పర్వదినం సందర్భంగా ఉరవకొండ నియోజకవర్గంలోని ముస్లిం సోదర సోదరీమణులకు వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.మిలాద్ ఉన్ నబీ పర్వదినం ప్రజలందరి జీవితాల్లో శాంతి, సంతోషం, సౌభ్రాతృత్వాన్ని నింపాలని ఆయన ఆకాంక్షించారు. ముస్లిం సోదర సోదరీమణులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకున్నారు.ఈ సందర్భంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, ప్రేమ, సోదరభావం, మానవత్వం వంటి విలువలను ప్రజలకు వివరించారు. సమాజంలో మత సామరస్యం, పరస్పర గౌరవం, శాంతి మరింత బలపడాలని ఆకాంక్షించారు.మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

